www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
01-09-2024
సంపుటి : 01 । సంచిక : 120 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## 'కాంగ్రెస్‌లో చేరుతున్నారా?'

- వినేశ్‌ఫోగాట్‌ను ప్రశ్నించిన విలేకరి
- రాజకీయాలు మాట్లాడదలచుకోలేదన్న రెజ్లర్
- రైతుల సంక్షేమంపైనే తన దృష్టి ఉందని వ్యాఖ్య

9



రాష్ట్రంలోని బౌద్ధ పర్యాటక స్థలాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని అంతర్జాతీయ పర్యాటక, ఆధ్యాత్మిక బౌద్ధక్షేత్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. బుద్ధవనంలో అంతర్జాతీయ మ్యూజియం నెలకొల్పేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో బుద్ధవనం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రానికి డీపీఆర్‌ను పంపించింది.

# బౌద్ధక్షేత్రాలకు మహార్దశ

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి

- బుద్ధవనంలో డిజిటల్ మ్యూజియం
- హైదరాబాద్ - నాగార్జునసాగర్ మధ్య 4 వరుసల రోడ్డు
- బుద్ధ విగ్రహం చుట్టూ టూరిజం సర్కిల్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

బుద్ధవనంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా 25 కోట్ల రూపాయలతో బుద్ధిస్ట్ డిజిటల్ మ్యూజియం, ఎగ్జిబిషన్, డిజిటల్ ఆర్కివ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వీటితో పాటు అంతర్జాతీయ బుద్ధ మ్యూజియం ఏర్పాటును కూడా ప్రణాళికలో పొందుపరచాలని నిర్ణయించింది. నాగార్జునసాగర్ సందర్శనకు వెళ్లే పర్యాటకులు బ్యాక్‌వాటర్ వరకు బోట్‌లో విహరించే మిగతా2లో...

### టూరిజం సర్క్యూట్

హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వరకు నాలుగు వరసల రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్ బీ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. కొత్త టూరిజం పాలసీలో భాగంగా ఫణిగిరి, నేలకొండపల్లి, నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్రాలతో పాటు హుస్సేన్ సాగర్‌లోని బుద్ధ విగ్రహాన్ని ఒకే టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హుస్సేన్‌సాగర్ పరిసరాలను ప్రపంచస్థాయి పర్యాటక హబ్‌గా రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# జరభద్రం!

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

## తక్షణ సహాయ చర్యలు చేపట్టండి


## సీఎస్, డీజీపీలను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు నేపథ్యంలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. రిజర్వాయర్ల గేట్లు ఎత్తుతున్న దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన మిగతా2లో...



## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేయడంతో పాటు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మిగతా2లో...



## ఎడతెరపి లేని వర్షం

- తడిసి ముద్దయిన భాగ్యనగరం
- రోడ్లన్నీ జలమయం.. ట్రాఫిక్ జామ్..
- సహాయక చర్యలను నేరుగా పరిశీలించిన కమిషనర్ రోనాల్డ్ రోస్
- సిటీకి మరో మూడు రోజుల అలర్ట్



2

## విజయవాడలో విరిగిపడిన కొండచరియలు

- చెరువులను తలపిస్తున్న ప్రధానరహదారులు
- ఐదుగురి మృతి

10



10

## అక్కరకొచ్చేలా..ఆకాంక్షలు తీర్చేలా..

- భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా కొత్త రెవెన్యూ చట్టం
- ముసాయిదాపై అభిప్రాయ సేకరణ ముగిసినందున త్వరితగతిన కొత్త చట్టాన్ని రూపొందించండి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

# ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావు కేసీఆర్?

## వచ్చి ఏమడుగుతావ్...ఏం చెప్తావ్?

- మీలా కాకుండా ప్రతిరోజూ ప్రజలను కలుస్తున్నాం..
- అర్హులైన వారందరికీ రైతు రుణమాఫీ అమలు చేస్తాం.
- రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ కేంద్రం ఏర్పాటుచేస్తాం
- రామగుండం బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

10





2

## రాష్ట్రంలో బందిపోట్ల పాలన సాగుతోంది

- ఉత్తమ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి


మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 87 | ₹ 109 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 158 | ₹ 180 |

# అప్పా చెరువుపై హైడ్రా నజర్

- వర్షంలోనే కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు
- 13 షెడ్లను తొలగిస్తున్న సిబ్బంది
- ఇద్దరు బిల్డర్లపై కేసులు
- బాచుపల్లిలో మరో ఆక్రమణదారుడిపై కేసు



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలను ఇతర ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకే ఏర్పాటైన హైడ్రా తన దూకుడును మరింత పెంచింది. పేద, పెద్ద అంటూ తేడా లేకుండా అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి, మిగతా2లో...



విద్యార్థులు లేరంటూ 1,864 స్కూళ్లను

# మూసేసే కుట్ర

- పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారు
- ప్రభుత్వంపై మండిపడ్డ కేటీఆర్
- విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

10

## మహేష్ కుమార్‌గౌడ్‌కే పీసీసీ పీఠం?

### ఓ నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం

### ఏ క్షణమైనా వెలువడనున్న ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్ :**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పీసీసీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే త్వరలోనే దీనికి తెరపడనున్నట్లు సమాచారం. తెలంగాణతో పాటు మూడు రాష్ట్రాలకు కొత్త పీసీసీ చీఫ్‌లపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు పూర్తి చేసింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ పేరు దాదాపుగా ఖరారు మిగతా10లో...

# ఎడతెరపి లేని వర్షం




**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. ఈ కారణంగా నగరంలోని పలు రద్దీ కూడళ్లు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా లక్డీకాపూల్, మెహిదీపట్నం, , బంజారాహిల్స్, హైటెక్ సిటీ, షేక్ పేట, రాజేంద్రనగర్, ఆసిఫ్ నగర్ తో పాటు బంజారాహిల్స్ , నాంపల్లి, పంజాగుట్ట బషీర్ బాగ్, జూబ్లీ హిల్స్ తదితర ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురుస్తుంది. మహానగరానికి రానున్న మూడు రోజుల పాటు వాతావరణ శాఖ రెయిన్ అలర్ట్ ఇచ్చింది. శివారు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురవగా, కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. మెయిన్ రోడ్లపైకి భారీగా వర్షం నీరు చేరింది. ఫలితంగా మెయిన్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ అయింది. రాకపోకలు స్తంభించాయి. నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్లన్నీ ట్రాఫిక్ తో నిండిపోయాయి. . పంజాగుట్ట, మాసాబ్ ట్యాంక్, మహావీర్ ఆస్పత్రి, అయోధ్య జంక్షన్, ఖైరతాబాద్ జంక్షన్ తోపాటు పంజాగుట్ట, సోమాజీగూడ రోడ్డుతో పాటు అప్పర్ ట్యాంక్ బండ్, తెలుగు తల్లీ ఫ్లై ఓవర్, బేగంపేట, రాణిగంజ్, ఎంజే మార్కెట్, నాంపల్లి,బంజారాహిల్స్, సంజీవరెడ్డి నగర్ కాలనీ, బల్కంపేట తదితర ప్రాంతాలతో పాటు ఐటీ కారిడార్ లో కూడా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. ముఖ్యంగా సెంట్రల్ జోన్ లోని ప్రధాన రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని వాహనదారులకు సూచించటంతో దాదాపు మూడు గంటల తర్వాత సాయంత్రం ఆరు గంటల కు కల్లా ట్రా ఫికర్ నుంచి వాహనదారులకు కాస్త ఉపశమనం కల్గింది. కానీ సెంట్రల్ జోన్ లోని అయోధ్య జంక్షన్, ఖైరతాబాద్ మెయిన్ రోడ్డు, పంజాగుట్ట చౌరస్తాతో పాటు ఇక్బాల్ మినార్, ఖైరతాబాద్ రైల్వే క్రాసింగ్ ల వద్ద వాహనాలు క్యూ కడుతున్నాయి. వర్షానికి సంబంధించిన సహాయం కోసం జీహెచ్ఎంసీ హెల్ప్ లైన్ నంబర్ 04- 2111 1111 గాని డయల్ 100 కు గాని, ఈవీడీఎం డీఆర్ఎఫ్ బృందాల సహాయం కోసం 9000113667 కు ఫోన్ చేయవచ్చునని అధికారులు తెలిపారు. ద్రోణి కారణంగా మహా నగరంలో రానున్న మూడు రోజుల పాటు చిరు జల్లుల నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. దీంతో జీహెచ్ఎంసీ, ఈవీడీఎం అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని బల్దియా నగరవాసులకు సూచించింది.

### మళ్లీ కన్వర్జెన్సీ సమావేశాలు

మహానగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు విపత్తుల నివారణ, వర్షాకాలం సహాయక చర్యలతో పాటు వివిధ సర్కారు శాఖల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు గతంలో జీహెచ్ఎంసీ పెద్దన్న పాత్రలో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశాలను బల్దియా కమిషనర్ ఆమ్రపాలి శనివారం మరోసారి తెరపైకి తెచ్చారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. సిటీ అభివృద్ధి వేదికగా 66 వ సిటీ కన్వర్జెన్స్ మీటింగ్ కు కమిషనర్ ఆమ్రపాలి అధ్యక్షత వహించారు. గత సిటీ కన్వర్జెన్స్ సమావేశంలో తీసుకున్న అజెండా పై చర్చించారు. ప్రస్తుత సమావేశంలో తీసుకోనున్న కొత్త ప్రతిపాదనల కు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. .సిటీ అభివృద్ధి లో భాగస్వామ్య శాఖలైన అర్ అండ్ బి, మెట్రో రైల్వే, విద్యుత్, జాతీయ రహదారులు ట్రాఫిక్, వాటర్ వర్క్స్, హెచ్ ఎం డి ఎ , రెవెన్యూ శాఖ అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. జీహెచ్ ఎం సీ ప్రగతి కి ఆయా శాఖ వద్ద గల సమస్యల పై పరిష్కారాన్ని సమకూర్చాలని కమిషనర్ సూచించారు. సిటీ సమగ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని కమిషనర్ ఆమ్రపాలి వివిధ విభాగాల అధికారులను కోరారు. హైదరాబాద్ మరింత ఇమెజ్ పెంచడం కోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పన,అంతర్జాతీయ స్థాయి లో అభివృద్ధి జరగాలని ప్రభుత్వ ఆకాంక్షకు అనుకూలంగా అన్ని విభాగాలు కృషి చేయాల్సిన అవసరముందని కమిషనర్ సూచించారు. .అన్ని శాఖల అధికారుల సమన్వయం తో నే గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో తీసుకున్న అజెండా అంశాల పై సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆయా శాఖల అధికారులకు కమిషనర్ సూచించారు.

## రాష్ట్రంలో బందిపోట్ల పాలన సాగుతోంది



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో బందిపోట్ల పాలన సాగుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ నాయకుల కమీషన్లు , దోపిడీ గురించి ప్రజలు చెబుతారని ఆయన అన్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని జరిగిందంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై ఆయన ఉపయోగించిన పదజాలంపై తీవ్రంగా స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టపగలు నోట్లకట్టలతో వారు మీరేనని.. రేవంత్‌ని అనాల్సిన మాటలను ఉత్తమ్ కుమార్‌రెడ్డి బీఆర్ఎస్‌పై వాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌ని అనడం చేతగాక కేసీఆర్ ను విమర్శిస్తున్నారన్నారు. ఉత్తమ్ భాష మార్చుకోవాలని హితవు పలికారు. ఎప్పుడూ ఇలాంటి మాటలు కేసీఆర్ మమ్మల్ని మాట్లాడనివ్వలేదన్నారు. వెనక వచ్చిన వ్యక్తి సీఎం పదవి గుంజుకుంటే చేతగాని దద్దమ్మ ఉత్తమ్ అంటూ మండిపడ్డారు. ఏళ్లుగా కట్టిన ప్రాజెక్టుల నుంచి నీటిని అందించడం చేతగాక అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. నీటి కోసం, విద్యుత్ కోసం ధర్నాలు జరుగుతున్నాయని.. ముందు వాటి గురించి మాట్లాడాలన్నారు. . తిట్ల దండకం మాట్లాడితే ఉత్తమ్ సీఎం కాలేరన్నారు. సాగునీటి ధర్నాలు ఇలానే కొనసాగితే యాసంగి నాటికి ప్రజల్లో తిరగలేరన్నారు. సాగునీరు అందించలేక నీటిపారుదల మంత్రిగా విఫలం అయ్యారని మండిపడ్డారు. చేతకాకపోతే మంత్రి పదవిపై ఉత్తమ్ పునరాలోచన చేయాలన్నారు. కాళేశ్వరం నీటిని అందించకపోతే కాంగ్రెస్ నాయకులకు రైతులతో దెబ్బలు తప్పవని.. రైతాంగ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఆదుకోవాలని రైతుల నుంచివిజ్ఞప్తులు వస్తున్నాయని.. త్వరలోనే రైతాంగ సమస్యలపై కేసీఆర్ కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. ప్రభుత్వం మెడలు వంచి రైతులను ఆదుకునేలా చేస్తామన్నారు.

## అప్పా చెరువుపై హైడ్రా నజర్

**(మొదటి పేజీ తరువాయి)**

అది అక్రమ నిర్మాణమని నిర్ధారణ అయిన వెంటనే హైడ్రా నేలమట్టం చేస్తోంది. తాజాగా గగన్ పహాడ్ సమీపంలోని అప్పా చెరువుపై శనివారం హైడ్రా అటాక్ చేసింది. ఇక్కడ బఫర్ జోన్ లో నిర్మించిన 13 షెడ్ లను హైడ్రా సిబ్బంది తొలగిస్తోంది. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా, హైడ్రా వర్షంలోనే ఆక్రమణలను నేలమట్టం చేసింది.. శంషాబాద్ పరిధిలో లో 35 ఎకరాల విస్తీర్ణంలో వున్న గగన్ పహాడ్ చెరువులో అక్రమం నిర్మాణాలు జరుగుతున్నట్లుగా హైడ్రాకు పలు ఫిర్యాదులు రావడంతో దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిన హైడ్రా అధికారులు అప్పా చెరువులో మూడు ఎకరాల పరిధిలో అక్రమంగా పదమూడు షెడ్లను నిర్మించినట్లుగా నివేదిక ఇచ్చారు. వెంటనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేయటంతో కూల్చి వేత పనులు కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక పోలీసులు, రెవెన్యూ, నీటి పారుదల, మున్సిపల్ విభాగాల ఆధ్వర్యంలో అప్పా చెరువులో అక్రమంగా నిర్మించిన పదమూడు షెడ్ల నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. ఈ తొలగింపులతో లతో ఆక్రమణకు గురైన మూడు ఎకరాల చెరువును హైడ్రా అధికారులు తిరిగి స్వాధీనం చేసుకొనున్నారు .

**ఖానా మెట్ ఈదుల కుంట ను సందర్శించిన కమిషనర్**

మాదాపూర్ సమీపంలోని ఈదుల కుంటలో కూడా కబ్జాలు, ఆక్రమణలు వచ్చినట్లు ఫిర్యాదులు రావటంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం కుంటను సందర్శించారు. సుమారు ఆరు ఎకరాల 5 గుంటల విస్తీర్ణం గల ఈ కుంట కబ్జా కు గురైనట్టు హైడ్రా కు ఫిర్యాదులు రావటంతో కమిషనర్ ఫుట్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్ లను పరశీలించారు. మట్టి తో ఆక్రమణ దారులు కుంటను పూడ్చుతున్నారని ఫిర్యాదులు రావటంతో క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు కమిషనర్ సందర్శించినట్లు తెలిసింది. చెరువులోని ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో మట్టితో చెరువును పూడ్చుతూ నిర్మాణాలకు యత్నిస్తున్న వారిని గుర్తించి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఫిర్యాదుల తో కేసు నమోదు చేస్తున్నట్లు తెలిసింది. దీనా గూడ ఎర్ల చెరువు బఫర్ జోన్ లో నిర్మాణాలు చేపట్టారని ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇద్దరు బిల్డర్లపై కూడా మియాపూర్ పీఎస్ లో పోలీసులు కేసులు నమోదు చేసినట్లు సమాచారం. నిజాంపేట్ ఎర్రకుంట లో అక్రమ నిర్మాణాలు చేపట్టాడని మ్యాప్స్ ఇన్ఫ్రా సంస్థపై ఇరిగేషన్ శాఖ అధికారులు కంప్లైంట్ చేయటంతో బాచుపల్లి పీఎస్ లో కేసు నమోదు చేయగా, ఈ నిర్మాణాలను ఇప్పటికే హైడ్రా కూల్చేసినట్లు తెలిసింది.

## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**(మొదటి పేజీ తరువాయి)**

గనులశాఖ డైరెక్టర్‌గా కే సురేంద్ర మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. భూసేకరణ, పునరావాస కమిషనర్‌గా టీ వినయ్ కృష్ణారెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చింది. మైనారిటీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయేషా మస్రత్ ఖానంను బదిలీ చేసింది. ఆమెను సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.మైనారిటీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా తఫ్సీర్ ఇక్బాల్, మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా షేక్ యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు ఇచ్చింది. మైనారిటీ ఆర్థిక సంస్థ ఎండీగా నిర్మలా కాంతి వెస్లీకి అదనపు బాధ్యతలు ఇవ్వగా.. వక్ఫ్ బోర్డ్ సీఈవోగా మహ్మద్ అసదుల్లా నియామకమయ్యారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా జీ మల్సూర్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పీ శ్రీజను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## బౌద్ధక్షేత్రాలకు మహర్దశ

**(మొదటి పేజీ తరువాయి)**

ఏర్పాట్లు పునరుద్ధరించాలని నిర్ణయించారు.

**హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్ వే..**

అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ స్థాయి డిజైన్లు తయారు చేయించాలని అధికారులకు సీఎం చెప్పారు. బుద్ధ విగ్రహం చుట్టూ టూరిజం సర్కిల్‌గా అభివృద్ధి చేయనున్నారు. ట్యాంక్‌బండ్, తెలంగాణ అమరుల జ్యోతి, నెక్లెస్ రోడ్డు, సంజీవయ్య పార్కు వరకు వలయాకారం లో స్కై వాక్ వే డిజైన్ చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఫుడ్ కోర్టులు, వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గోల్కొండ చుట్టూ రోడ్లన్నీ ఇరుకుగా అయినందున, వాటిని విశాలంగా అభివృద్ధి చేయాలని, ఆక్రమణలుంటే తొలగించాలని అయితే అక్కడి ప్రజలు నిరాశ్రయులు కాకుండా పునరావాస చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# రెండురోజులు దండిగా వానలు

**పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ**



**విశ్వంభర, హైదరాబాద్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షపాతం రికార్డయ్యింది. ఈ క్రమంలోనే వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. మరో రెండురోజులు పలుజిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

- ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ రెడ్ అలర్ట్ ప్రకటించింది.
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.
- భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలకు భారీ వర్షాలు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను ప్రకటించింది. ఇదిలా ఉండగా.. శనివారంఉదయం నుంచి తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కామారెడ్డి, ఖమ్మం, వరంగల్, భువనగిరి, నల్గొండ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కామారెడ్డి జిల్లా బోమన్‌దేవిపల్లిలో 13.7 సెంటీమీటర్లు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం 12.7 సెంటీమీటర్ల వర్షం కురిసిందని టీఎస్‌డీపీఎస్ వివరించింది.

# జరభద్రం



**(మొదటి పేజీ తరువాయి)**

చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు.

**ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడండి..సీఎస్ శాంతికుమారి**

రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలుగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ డా. జితేందర్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జీహెచ్ ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి కాటా, మున్సిపల్ పరిపాలన విభాగం సంచాలకులు గౌతమ్ లు కూడా ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

**పాఠశాలలకు సెలవు ప్రకటించే అధికారం కలెక్టర్లకే..**

తెలంగాణా తో పాటు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలోను భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఏ విధమైన ఆకస్మిక విపత్తు ఎదురైనా సమర్థంగా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. ప్రతీ జిల్లా కలెక్టర్ కార్యాలయం తోపాటు జీహెచ్ఎంసీ, రాష్ట్ర సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్ లను తెరవాలని తెలిపారు. లోతట్టు, వరద ప్రాంతాల నుండి ప్రజలు వెళ్లకుండా తగు నిఘా పెట్టాలని అన్నారు. ముఖ్యంగా ఉధృతంగా పారే వాగుల వద్ద ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి పర్యవేక్షించాలని చెప్పారు. వర్షాల దృష్ట్యా జిల్లాల్లో పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించుకునే నిర్ణయం జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని సి.ఎస్ స్పష్టం చేశారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాలనుండి ప్రజలను తరలించి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసే విషయంలో ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

**ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరచండి**

భారీ వర్షాలు, వరదల వల్ల తీసుకునే జాగ్రత్తలపై ప్రజలను ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా చైతన్య పరచాలని అన్నారు. గ్రామాలు, పట్టణాలలోని మంచి నీటి వనరులైన ట్యాంకులు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవడంతోపాటు, అంటూ వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ లను చేపట్టాలని తెలిపారు. వైద్య బృందాలను అప్రమత్తం చేశామని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగు మందులను సిద్ధంగా ఉంచామని సి.ఎస్ శాంతి కుమారి తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు హైదరాబాద్, విజయవాడ లలో ఉన్నాయని, ఏవిధమైన అవసరం ఉన్నా ముందస్తు సమాచారం ఇస్తే ఈ బృందాలను పంపించగలమని తెలియచేసారు. గోదావరి, కృష్ణా నదుల పరీవాహక ప్రాంతాల్లోని జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వరదలు, వర్షాల వల్ల కొన్ని చోట్ల చెరువులకు స్థానికులు గండ్లు పెట్టె అవకాశం ఉందని, దీనివల్ల లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈవిధమైన చర్యలను పాల్పడకుండా నీటిపారుదల శాఖ అధికారులచే పర్యవేక్షించాలని సూచించారు.

### సమన్వయంతో పనిచేయాలి

**జిల్లాలో పోలీస్, నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, పంచాయితీ రాజ్ తదితర శాఖలతో కలసి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ లో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయడంతో పాటు, మాన్ హోల్ లను తెరవకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని పోలీస్ కమీషనర్ కార్యాలయాలు, ఎస్.పీ లను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్ల తో సమన్వయంతో పనిచేయాలని, అన్ని కమీషనరేట్లు, ఎస్.పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు వెల్లడించారు.**

## హెడ్ క్వార్టర్ విడిచివెళ్లొద్దు

**నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు**



**విశ్వంభర, హైదరాబ్:** రాగలరెండురోజులు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హెడ్‌క్వార్టర్స్‌ని విడిచి వెళ్లొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. నీటి పారుదలశాఖపై ఆయన సమీక్షించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను అధ్యయనం చేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుమతి లేకుండా ఇంజినీర్లు హెడ్ క్వార్టర్‌ని విడిచి వెళ్లొద్దన్నారు. రెడ్ ఎలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ఎవరూ సెలవులు పెట్టొద్దని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రిజర్వాయర్లు, చెరువులను మానిటరింగ్ చేస్తుండాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు నీటి స్థాయిలను పర్యవేక్షించాలని.. మరీ ముఖ్యంగా ఓవర్ ఫ్లోని నిరోధించేందుకు ఏట్లు, స్పిల్ వేల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలని.. ఎప్పటికప్పుడు డ్యామ్‌లు, కట్టలు, కెనాల్‌లను తనిఖీలు చేయాలన్నారు. ప్రమాదం పొంచి ఉందన్న ప్రాంతంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు మించి రైల్వే ఎఫెక్టెడ్ చెరువులపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి పారుదలశాఖ ఇంజినీర్లు వేగంగా స్పందించాలని.. విపత్తులు సంభవిస్తే స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి ఆదేశించారు.

## కోదాడ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

**నందిగామ వద్ద హైవేపైకి చేరిన వరద నీరు**
**విజయవాడ వెళ్లే వాహనాలు మళ్లింపు**

**విశ్వంభర, హైదరాబాద్:** భారీ వర్షాల కారణంగా శనివారం సూర్యాపేట జిల్లా కోదాడలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నందిగామ వద్ద వాగు పొంగడంతో హైవేపైకి చేరిన వరద నీరు చేరింది. దాంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపుగా వెళ్లే వాహనాలను ఖమ్మం వైపుగా అధికారులు మళ్లించారు. హైదరాబాద్ – విజయవాడ హైవేపై కోదాడ బైపాస్‌లో భారీ నిలిచిన వాహనాలు నిలిచాయి. అలాగే జగ్గయ్యపేట వద్ద రోడ్డు బ్లాక్ అయ్యింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లేందుకు నార్కట్‌పల్లి నుంచి వయా మిర్యాలగూడ, గుంటూరు మీదుగా విజయవాడకు ట్రాఫిక్‌ను మళ్లించారు.

**నిబంధనలు పాటించండి**

హైవే వెంట ట్రాఫిక్ నేపథ్యంలో ఇబ్బందులు ఏర్పడకుండా వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని పోలీసులు సూచించారు. హైవే వెంట అధిక వాహనాలు వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఉన్న గ్రామాల ప్రజలు ప్రమాదాల గురుకాకుండా జాగ్రత్తలు పాటించాలన్న నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. ఇదిలా ఉండగా.. సూర్యాపేట జిల్లాలో శనివారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు నిండి అలుగులుపారుతున్నాయి. అత్యధికంగా లక్కవరం రోడ్‌లో అత్యధికంగా 27.3 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. అలాగే, చిలుకూర్‌లో 26.7, మట్టంపల్లిలో 24, కోదాడలో 17, రఘునాథపాలెంలో 15, బాలారంతండా 14 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

## హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పబ్బులపై అధికారుల దాడులు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి నార్కోటిక్ బ్యూరో, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా 25 పబ్బుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రాత్రి 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. 107 మంది అనుమానితులకు డ్రగ్ డిటెక్షన్ కిట్లతో పరీక్షలు నిర్వహించారు. ఆరుగురు మత్తుపదార్థాలు సేవించినట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. మరోచోట గంజాయి పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. రంగారెడ్డి జిల్లాలోని బార్లలో మరో ముగ్గురికి పాజిటివ్‌గా తేలింది. డ్రగ్ డిటెక్షన్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారిని నార్కోటిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగు పబ్‌ల్లో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ రాగా.. జీ40 పబ్‌లో ఇద్దరు, విస్కీ సాంబ పబ్‌లో ఇద్దరికి జోరా, క్లబ్ రోగ్ పబ్బుల్లో ఒక్కొక్కరికి పాజిటివ్ వచ్చింది.


## తెలంగాణ ప్రగతిశీల మహిళా సంఘం
# 7వ రాష్ట్ర మహాసభలు ఘనంగా ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రగతిశీల మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన కార్యకర్తలతో నగరం ఎరుపుమయం అయ్యింది. వీఎస్టీ నుంచి ఇందిరాపార్క్ వరకు భారీ ప్రదర్శనగా కళాకారుల డప్పు దరువులు, నృత్యాలు,నినాదాలతో పాటలు తోడుగా కవాతు కొనసాగింది. ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అని నినదిస్తూ.., మహిళల రక్షణకై, హింసలేని జీవితం మహిళల హక్కు అని నినదిస్తూ.., ఉదయం 11 గంటలకు మొదలైన ర్యాలీ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. ఇందిరా పార్క్ లో భారీ వర్షం లోనూ మధ్యాహ్నం 3 గంటల వరకూ సభ కొనసాగింది.




ఈ సభకు ముఖ్య వక్తగా ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షులు డా.అపర్ణ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనూ.. దేశంలోనూ మహిళల గొంతులు నొక్కడానికి ఈ ప్రభుత్వాలు చేస్తున్నాయని అన్నారు. అందుకే మీటింగ్‌కు పర్మిషన్ లు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై లైంగిక హింస పెరిగిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అయిన మనువాద భావజాలాన్ని దేశంపై రుద్దుతున్నారని అన్నారు. ఇది మహిళలపై అత్యంత ప్రభావం చూపుతుందని అన్నారు. ఢిల్లీలో నిర్భయ హత్యాచారం సందర్భంలో పోరాటం చేసి చట్టం తెచ్చుకున్నా, లైంగిక వేదింపులు ఆగట్లేదన్నారు. నిన్న పశ్చిమ బెంగాల్‌లో మహిళా డాక్టర్ హత్య కుట్ర వల్ల జరిగిందని అన్నారు. ఇందులో ప్రభుత్వాలు రాజకీయాలు చేస్తూ సరైన చర్యలు తీసుకోవట్లేదని అన్నారు. మహిళలను అణచాలంటే లైంగిక దాడే పరిష్కారం అనేలా పితృస్వామ్యం పెట్రేగిపోతుందని అన్నారు.

రైతు చట్టాలను సంఘటిత పోరాటాలతో తిప్పికొట్టాం కానీ 4 కార్మిక చట్టాలతో ఈ ప్రభుత్వం ముందుకొస్తుందని, దానికి వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించాలన్నారు.ఉపాధిహామీ పథకంలో మహిళలకు సరైన వేతనాలు,అవినీతి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు జి.ఝాన్సీ అధ్యక్షత వహించారు. వక్తలుగా ఎం.లక్ష్మి, పీఓడబ్ల్యూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అందే మంగ పీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అరుణ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జి.అనసూయ, డా.పిట్లా సరిత, ఎం.జ్యోతి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆర్.సీత, జె.హరిత, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శులు, గీత రాష్ట్ర కోశాధికారి ఎన్.కావేరీ, హైదరాబాద్ అధ్యక్షులు ఉన్నారు. పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలు 1000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మంచాల గ్రామంలో శనివారం సినీ దర్శకులు మురారిశెట్టి లక్ష్మణ్ తల్లి, రజాకార్లపై పోరు నడిపిన మురారి శెట్టి పుల్లయ్య సతీమణి మురారిశెట్టి రాములమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కవి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, లయన్ కేవీ రమేష్ రాజు(మాజీ రైల్వే బోర్డు మెంబెర్ ) ఇతరులు.
- విశ్వంభర, మంచాల



## మహంకాళీ ఉత్సవాలకు మంత్రి పొన్నంకి ఆహ్వానం

**విశ్వంభర, చేగుంట :** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చేగుంటలో జరిగే శ్రీ మహంకాళి ఉత్సవాల్లో భాగంగా ఫలహారం బండి ఊరేగింపు రథోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సంద్రగు శ్రీకాంత్ ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, రాంపూర్ మాజీ సర్పంచ్ కాశ బోయిన భాస్కర్, మేడి గణేష్, కన్యారం సతీష్, ఆదిత్య పాల్గొన్నారు.

## బెదరబోయిన రాములు పదవీ విరమణ




**విశ్వంభర, చేగుంట :** చేగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం బెదరబోయిన రాములు పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ హాజరై రాములు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాములు పిలవగానే పలికే వ్యక్తి అని మంచి స్వభావం కలవాడని ఉద్యోగరీత్యా పదవీ విరమణ తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల ఎంపీడీవో చిన్నారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మడిగెల శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ నాగభూషణం, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, చేగుంట :** చేగుంట మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చింతకాయల చంద్రం మరణించిన విషయం తెలుసుకొని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట కాంగ్రెస్ యువ నాయకుడు సంద్రగు శ్రీకాంత్ బాధిత కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, నార్సింగి మండల పార్టీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గోవర్ధన్, చేగుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్, మల్కయ్య, అంచనూరి రాజేష్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# 4న ప్రొ. కోదండరాంకి ఘన సన్మానం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమ రథసారథి, తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాంకి తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ కమిటి ఆధ్వర్యంలో ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమం సెప్టెంబర్ 4న చిక్కడపల్లి, త్యాగరాయ గాన సభలో నిర్వహించనున్నట్లు తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నర్సయ్య తెలిపారు. సన్మాన కార్యక్రమానికి సంభంధించిన పోస్టర్‌ను శనివారం టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రతినిధిగా, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన సాధకుడిగా ప్రొఫెసర్ కోదండారం పెద్దల సభలో అడుగిడుతున్న శుభ సందర్భంలో ఆత్మీయ పౌర సన్మానం చేస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 4న ఉదయం 11 గంటలకు లోయర్ ట్యాంక్ బండ్‌లోని కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఇందిరా పార్క్ అశోక్ నగర్ చౌరస్తా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ చిక్కడపల్లి మీదుగా భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీ పొడువున తెలంగాణ పౌర సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక,




సంఘాలతో పాటు తెలంగాణ ఉద్యమకారులు ప్రత్యేక స్వాగత వేదికలు ఏర్పాటు చేసి ఉద్యమ శిఖరానికి జేజేలు పలుకనున్నట్టు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల చిహ్నాలైన బతుకమ్మలు, బోనాలు, పోతురాజులు, కోలాటం, గిరిజన ఆదివాసి నృత్యాలతో "సార్"కు ఘన స్వాగతం తెలుపుతామన్నారు. అనంతరం త్యాగరాయ గాన సభలో ప్రొ. కొదందరాంకు ఆత్మీయ పౌర సన్మానం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, తొలి మలిదశ ఉద్యమకారులు, ప్రొఫెసర్ కోదండరాం అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్రుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధర్మార్జున్, టైరి రమేష్, పల్లె వినయ్, రాష్ట్ర నాయకులు మారం లక్ష్మారెడ్డి, కొత్త రవి, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్జల్, బీసీ సెల్ అధ్యక్షులు జశ్వంత్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు, నగర ఉపాధ్యకులు మానేపల్లి లక్ష్మణ్, పునిరెడ్డి జైపాల్ రెడ్డి, కోశాధికారి సురేష్ కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, నాయకులు శ్రావణ్ కుమార్, కాకునూరి సుధాకర్, భూషణ్, పుష్పలత, హనుమంత్ రెడ్డి, రమేష్, రవికాంత్, ఎల్లయ్య, వీరయ్య పాల్గొన్నారు.












# మంచి తిండి... తినాలండీ!

## పోషకాహార లోపమే అనారోగ్యానికి మూలం

### జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా

జీవించడానికి ప్రాథమిక అవసరంలో మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించడం అసంభవం. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదించినా, ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే.. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. అయితే ఆ తినడంలో పోషక పదార్థాలపై ఏ మాత్రం దృష్టి పెట్టక పోవడం అనారోగ్యానికి హేతువు అవుతోంది. ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగుతామనో, లావు అయిపోతామనో అనేక కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్థలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్న వారు చాలా మంది ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి జబ్బుల బారిన పడకుండా, ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన పెంపొందించు కోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసు కోవాలి.

**ఏం తినాలి?**

భారతీయులు రోజూ కనీసం 400 గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. పోషకాలు అధికంగా ఉండే ఆహారం శక్తిని అందిస్తాయి. పండ్లు, కూర గాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బబ్బెర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50 శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి.

తాజా పండ్లు, గోధుమ రొట్టె, బ్రౌన్ రైస్, పాలు, పెరుగు, జున్ను వంటి పాల మొక్కల ఆధారిత ప్రత్యామ్నాయాలు, బలవర్ధకమైన బాదం లేదా సోయా పాలు తగినంత ద్రవాలు, ఎక్కువగా తియ్యగా ఉండే పానీయాల వంటి వాటిని తీసుకుంటే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఎర్ర మాంసం, చికెన్, చేపలు, ఆకుకూరలు, బీన్స్, కాయ ధాన్యాలు, కాయలు వంటివి ఐరన్ యొక్క మంచి వనరులు. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని ఐరన్ కలిగిన శాఖాహార వంటి వాటితో కలిపి తినడం వల్ల పోషణ మెరుగు పడుతుంది. ప్రసవ సమయంలో ఉన్న మహిళలకు పుట్టుకతో వచ్చే లోపాలను తగ్గించడానికి తగినంత ఫోలేట్ (ఫోలిక్ యాసిడ్) తీసుకోవడం ఉత్తమం. వంట గదిలో తయారు చేసిన కూరగాయలు, బీన్స్, జున్ను, పెరుగు వంటి వాటిని తీసుకోవడం ఉత్తమం. ఎక్కువ భాగం కేలరీలు ఉన్న వాటిని తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరం. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. బిస్కెట్లు, కుకీలు, కేకులు , స్వీట్లు వంటి ప్యాకేజీ చేసిన ఆహారాలను తగ్గించాలి. వీలైన మేరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకోవాలి. తీసుకునే ఆహారంలో నాణ్యతను గుర్తించడం అత్యంత అవసరం.

> “ జాతీయ పోషకాహార వారోత్సవం (ఎన్ ఎన్ డబ్ల్యు) పోషణ, ఆరోగ్య సంబంధిత సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారిస్తుంది. ఆరోగ్యం, సంక్షేమం ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుండి 7వ తేదీ వరకు ఈ వారోత్సవాన్ని నిర్వహించుకుంటారు. ఈ బృహత్ కార్యక్రమ ప్రచారాన్ని 1982లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పోషకాహార లోపం వల్ల ప్రభావాలు, కారణాలు, ప్రతికూల చర్యలను తెలియజెప్పి ప్రజలలో ఆరోగ్యకరమైన జీవనం, మంచి ఆరోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ప్రచారాన్ని ప్రారంభించారు.

### శిశువు జన్మించినప్పటి నుంచీ...

చిన్నారులకు కనీసం 9 నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది.

# చైతన్య దీప్తి... తెలుగు భాష, సంస్కృతుల స్ఫూర్తి

## నేడు శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వ్యవస్థాపక దినం




నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో చాలా మందికి తెలియదు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం హైదరాబాదు లోని ప్రాచీన గ్రంథాలయం. తెలుగంటే వల్లమాలిన అభిమానం గల రావిచెట్టు రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుతో కలసి శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, తర్వాత విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని స్థాపించారు. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఈ గ్రంథాలయం తాలూకు రెండువేల రూపాయల విలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే ప్రారంభమైంది.

ఈ గ్రంథాలయం 1901 సెప్టెంబర్ 1న హైదరాబాదులోని రాంకోఠి ప్రాంతంలో స్థాపితమైంది.. ఇది తెలంగాణ ప్రాంతంలో మొదటి గ్రంథాలయం. దీని స్థాపనతో ప్రారంభమైన నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమం తెలంగాణ ప్రజలలో చైతన్య కలుగజేసి తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవనానికి అపారమైన కృషి జరిపింది. నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్వంచ, భద్రాచలం సంస్థానాధిపతి రాజా పార్థసారథి అప్పారావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షుడుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు.

ఆనాటి సభలో పాల్గొన్న పెద్దలలో మునగాల రాజా నాయని వెంకట రంగారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, డా. ఎం.జి.నాయుడు, ఆదిపూడి సోమనాథరావు, శ్రీ మైలవరపు నరసింహశాస్త్రి, రావిచెట్టు రంగారావు, ఆదిరాజు వీరభద్రరావు, కొఠారు వెంకట్రావు నాయుడు పేర్కొనదగినవారు.

ఈ సంస్థ ప్రథమ గౌరవ కార్యదర్శి రావిచెట్టు రంగారావు 1910లో స్వర్గస్థులు కాగా, ఆయన స్థానంలో కర్పూరం పార్థసారధి నాయుడు కార్యదర్శిగా గ్రంథాలయానికి స్వంత భవనం నిర్మించాలని సంకల్పించారు. రంగారావు సతీమణి రావిచెట్టు లక్ష్మీ నరసమ్మ గారు భాషా నిలయానికి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళం ప్రకటించారు. దానితో ఇప్పుడు సుల్తాన్‌బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం జరిగింది.

1915 లో ఆంధ్ర పితామహుడిగా ప్రసిద్ధిచెందిన శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు కార్యదర్శి పదవిని చేపట్టిన తర్వాత పాత ఇల్లు స్థానంలో కొత్త భవనం నిర్మించడానికి దీక్ష వహించారు. నాయని వెంకట రంగారావు, కర్పూరం పార్థసారధి, నాంపల్లి గౌరీశంకర వర్మ, లాల్ జీ మేఘ్ జీల ఆర్థిక సహాయంతో నూతన భవన నిర్మాణం జరిగింది. ఈ భవనానికి ప్రఖ్యాత విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి సెప్టెంబర్ 30, 1921 తేదీన ప్రారంభోత్సవం చేశారు.

**తెలుగు వారందరికీ కూడలి**

భాషా నిలయం జంట నగరాలకే కాక తెలంగాణ ప్రాంతపు తెలుగు వారందరికీ కూడలి స్థలమైనది. ఉత్సవాలు, ప్రసంగాలు, సభలు, సమావేశాలు జరుపుకోవడానికి మంచి అవకాశం కలిగింది. శ్రీ కృష్ణదేవ రాయలు జయంతి ఉత్సవంతో ప్రారంభించి నన్నయ, తిక్కన, పోతన, వేమన మొదలైన మహాకవుల జయంతి ఉత్సవాలను ప్రతియేట జరుపుతూ ఉండేవారు. ప్రాచీన కవులే కాక కందుకూరి, గురజాడ, గిడుగు, కొమర్రాజు వంటి ఆధునిక భాషా సేవకుల జయంతులు, వర్ధంతులు కూడా జరుప సాగారు. భాషా నిలయం స్థాపన జరిగి 25 సంవత్సరాల రజతోత్సవాలను 1927 ఫిబ్రవరి 16, 17, 18 తేదీలలో కావ్యకంఠ గణపతి శాస్త్రి అధ్యక్షతన జరిగాయి. అప్పటి గౌరవ కార్యదర్శి బూర్గుల రామకృష్ణా రావు ప్రధాన పాత్ర పోషించి రజతోత్సవ సంచిక ప్రచురించారు. దీని స్వర్ణోత్సవాలు 1952 సెప్టెంబరు 1వ తేదీ నుండి మూడు రోజులపాటు అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన వైభవంగా జరిగాయి. అప్పటి ఆంధ్ర ప్రభుత్వ ఆస్థానకవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ప్రారంభోత్సవం చేశారు.

భాషా నిలయ వజ్రోత్సవాలు 1962 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అధ్యక్షతన జరిగిన మూడు రోజుల ఉత్సవాలు నిర్వహించి వివిధ వజ్రోత్సవ సంచికను ప్రచురించారు.

భాషా నిలయపు అమృతోత్సవం 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నేతృత్వంలో అత్యంత వైభవంగా జరిగాయి. శతాబ్ది ఉత్సవాలు 2002 సెప్టెంబర్ 16వ తేదీన భాషా నిలయం ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉత్సవాలను ప్రారంభించారు.

**తెలుగు భాషా నిలయంగా మార్పు**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగాక 2016 జూన్ 29నుండి తెలుగు భాషా నిలయంగా పేరు మార్చుకుని, సాహితీ ప్రియులకు ఉపకరిస్తోంది.. 2015 అక్టోబర్ 29 నుండి నుంచిసీనియర్ జర్నలిస్టు ఉడయవర్లు కార్యదర్శిగా, ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి గౌరవ అధ్యక్షులుగా, స్వాతంత్ర్య సమర యోధులు నూతి శంకర్ రావు కార్యనిర్వాహక అధ్యక్షులుగా, నేటికీ, సాహిత్య సభలూ, సమావేశాలు జరిపిస్తున్నారు. 2016లో రావిచెట్టు రంగారావు దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. మూల నిధిని సమకూర్చుకుని, వడ్డీ డబ్బులతో తెలుగు భాషా పరిరక్షణకు పాటు పడిన మహనీయుల స్మృత్యర్థం మాసానికి ఒక సారి జయంతి వేడుకలు నిర్వహించి, వారి పేర్ల మీద 9 అవార్డులు, నగదు అందిస్తున్నారు.

# లోకసభ ఏకగ్రీవ తొలి స్పీకర్ సంగ్మా




## నేడు జయంతి

లోక్ సభ చరిత్రలో, అన్ని రాజకీయ పార్టీల సార్వత్రిక మద్దతుతో, స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మొదటి వ్యక్తి సంగ్మా. ప్రతిపక్షం నుండి స్పీకర్ పదవిని నిర్వహించిన మొదటి వ్యక్తి, అతి పిన్న వయస్కుడు. పి.ఎ.సంగ్మా (1947 సెప్టెంబరు 1 – 2016 మార్చి 4) ఒక ప్రొఫెసర్, న్యాయవాది, జర్నలిస్ట్, సీనియర్ రాజకీయ నాయకులు. భారత దేశ లోక్ సభ స్పీకరుగా 1096 నుండి 1998 వరకు పనిచేశారు. ఆయన మేఘాలయ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా 1988 నుండి 1990 వరకు పని చేశారు. 1996 నుంచి 1998 వరకు లోక్ సభ స్పీకర్ గా వ్యవహరించిన సంగ్మా, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీపీ)కి అధ్యక్షుడు కూడా.

పి.ఎ.సంగ్మా పూర్తిపేరు పూర్ణో అజితోక్ సంగ్మా. ఆయన 1947, సెప్టెంబరు 1న మేఘాలయ పశ్చిమ గారో పర్వత ప్రాంతంలోని ఛాపతి గ్రామంలో మరక్ సంగ్మా, చింగ్మీ సంగ్మా దంపతులకు జన్మించారు. షిల్లాంగ్ లోని ఆంటోనీ కాలేజీలో బీఏ (హానర్స్) పూర్తిచేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో పని చేశారు. కాలేజీ చదువుల అనంతరం పూర్తికాలం రాజకీయ నేతగా కెరీర్ ప్రారంభించిన సంగ్మా. 1973లో మేఘాలయ యూత్ కాంగ్రెస్ కమిటీకి ఉపాధ్యక్షుడయ్యారు. తర్వాతి ఏడాది ఆ విభాగానికి జనరల్ సెక్రటరీ అయ్యారు. 1975-1980 మధ్య కాలంలో మేఘాలయ పీసీసీ సెక్రటరీగా వ్యవహరించారు. తురా ఎస్టీ నియోజకవర్గం నుంచి 1977లో (6వ లోక్ సభకు) పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన సంగ్మా, ఎంపీగా కొనసాగుతూ, 1996 మే 25 నుంచి 1998 మార్చి 23 వరకు (11వ లోక్ సభకు) లోక్ సభ స్పీకర్ గా వ్యవహరించారు. కేంద్రమంత్రి వర్గంలోనూ పలు శాఖలు నిర్వహించిన సంగ్మా. 1988 నుంచి 1990 వరకు మేఘాలయ ముఖ్యమంత్రిగా పని చేశారు. అటుపై మళ్లీ కేంద్ర పదవులు చేపట్టారు. ఈశాన్య ఎంపీల ఫోరం ఛైర్మన్ గా మరణించే వరకూ ఉన్నారు.

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీపై 1999లో తిరుగుబాటు బావుటా ఎగరేసిన పీఏ సంగ్మా. శరద్ పవార్, తారీఖ్ అన్వర్ లతో కలిసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని ఏర్పాటు చేశారు. అయితే 2011లో రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలవాలనుకున్న ఆయన నిర్ణయాన్ని ఎన్సీపీ సమర్థించక పోవడంతో ఆ పార్టీని వీడి సొంతగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీపీ)ని స్థాపించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రణబ్ ముఖర్జీపై పోటీచేసి ఓటమి పాలయినప్పటికీ గిరిజన నేతగా ఆయన చేసిన రాజకీయ పోరాటం చరిత్రలో నిలుస్తుంది.

సుదీర్ఘ రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా పేరుపొందిన ఆయన గిరిజనుల అభ్యున్నతి కోసం కృషిచేశారు. సంగ్మాకు భార్య, కుమార్తె అగాథా, కుమారులు కొన్రాడ్, జేమ్స్ సంగ్మాలు ఉన్నారు. ఆయన ముగ్గురు పిల్లలు కూడా రాజకీయ రంగంలో రాణిస్తుండటం గమనార్హం. అగాథా సంగ్మాకు పార్లమెంట్ కు ఎన్నికైన అతిపిన్న వయస్కురాలిగా, తర్వాత కేంద్ర మంత్రిగా రికార్డుఉంది. గుండెపోటుతో ఆయన 2016 మార్చి 4 న ఉదయందిల్లీలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# జానపద కళల పరిరక్షణకు కృషి

## కవులు, కళాకారులకు సముచిత స్థానం కల్పిస్తాం: మంత్రి జూపల్లి కృష్ణారావు


**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో అంతరించిపోతున్న జానపద కళారూపాలకు మళ్లీ పునరుత్తేజాన్ని తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తు ందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళారంగానికి పెద్దపీట వేస్తుందని, కవులు, కళాకారులు, రచయితలకు సముచితస్థానం కల్పిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ సారిపల్లి కొండల రావు ఫౌండేష, యువకళావాహిని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల లాంటి ప్రసార మాధ్యమాలు రాకముందు కథలు, నాటికలు వేసే జానపద కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని, దీంతో కష్టానికి తగ్గ ఫలితం పొందేవారన్నారు. కానీ ప్రస్తుతం అరచేతిలో ప్రపంచాన్ని చూసే రోజులొచ్చాక కళాకారుల పరిస్థితి దయనీయంగా మారిపోయిందని, దీంతో కళాకారుల వద్ద ఉన్న ప్రతిభను మాటల్లో చెప్పుకోవడానికి తప్ప ప్రదర్శిస్తే చూసేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న కాలంలో యువత వ్యాపకాలు మారిపోయాయని, చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, యువతలో మార్పు తీసుకువచ్చేందుకు కవులు, కళాకారులు, రచయితలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఒక దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే, ప్రాచీన వారసత్వాన్ని భావితరాలకు అందించే



కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై ఉందని తెలిపారు. కళలను నమ్ముకొని జీవించే కళాకారులను ప్రోత్సహిస్తూ.. వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యాటక రంగంలో జానపద కళాకారుల సేవలను ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, తెలంగాణ కళారూపాలను తెలియజేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజల, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు కెతావత్ సోమలాల్, గడ్డం సమ్మయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, జానపద కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు కె.వి.రమణాచారి, పారిశ్రామికవేత్త సారిపల్లి కొండల రావు, యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, అమిగోస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వహకులు రమణరెడ్డి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




## యువకుడు అదృశ్యం



**విశ్వంభర, ఎల్బీనగర్:** యువకుడు అదృశ్యం అయిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 4 లో నివాసం ఉండే సూరజ్ కుమార్ (27) దినసరి కూలికుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. జులై 5వ తేదీన కుటుంబ సభ్యులతో గొడవపడి జులై ఆరో తేదీన ఇంట్లో ఎవరు చెప్పకుండా బయటికి వెళ్ళాడు. వెళ్లే సమయంలో సెల్‌ఫోన్ కూడా ఇంట్లోనే ఉంచి వెళ్ళాడు. కుటుంబ సభ్యులు తెలిసినవారిని, బంధువులను, స్నేహితులను ఆరాతీయగా ఫలితం లేకపోవడంతో చైతన్యపురి పోలీస్స్టేషన్లో ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిస్తే 8712579308, 8712662358 నెంబర్లలో సంప్రదించవలెను అని కోరారు.

## పూలతో లక్ష్మి సహస్ర నామాలు



**విశ్వంభర,కొత్తపేటకొత్త:** పేట కన్యకా పరమేశ్వరి దేవాలయం లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలతో లక్ష్మి సహస్ర నామాలు సామూహిక శ్రీ దేవి కడ్గమల సొత్ర పారాయణం మంత్ర పుష్ప నీరాజనం కార్యక్రమంలో టి పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆ లక్ష్మి దేవి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల రాజు, రామ్ నారాయణ, పురుషోత్తం గుప్త , నీలా , శ్రీధర్, రమణయ్య, లోకేష్ గుప్త,భువనగిరి శ్రీనివాస్, అంజయ్య స్వామి ,రాజు పాల్గొన్నారు.

## కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, తిప్పర్తి:** తిప్పర్తి మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన మండల శివ అకాల మరణం చెందడంతో విషయం తెలుసుకున్న తిప్పర్తి మాజీ జెడ్పిటిసి, చంద్రం ఫౌండేషన్ చైర్మన్ తండు సైదులు గౌడ్ ఆయన పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు . తక్షణ సహాయంగా పదివేల రూపాయలు 10000 ఆర్థిక సహాయంను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ముగిరి, పాల్వాయి సాగర్, శిరసవాడ సైదులు, కత్తుల కొండయ్య, పల్లె శేఖర్, జాకటిసుమన్,గుండురవి, కొత్త లింగస్వామి,పెద్ది రాములు, శ్రీను పాల్గొన్నారు.

## అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు మరియు సంబంధిత అధికారులతో క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌తో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పట్టణ బస్టాండ్, మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా శాశ్వత పరిష్కారం చేయాలని అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సైడ్ డ్రెన్, రోడ్డు లేకుండా ఉన్నాయని వాటిని గుర్తించి నిర్మించడానికి దృష్టి సారించాలని తెలిపారు. పట్టణంలో కుక్కల, కోతుల బెడద ఉండకుండా చూడాలని అన్నారు. వాటితో పాటు వీధి దీపాలు,ప్రతి వార్డులో సురక్షిత త్రాగునీరు అందేలా కృషి చేయాలని పారిశుద్ధ పనులను మెరుగుపరిచి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు.

## పెన్షన్ విద్రోహ దినం పాటించండి




**విశ్వంబర, హైదరాబాద్:** సి.పి.ఎస్.ను రద్దుచేసి ఓపిఎస్‌ను వెంటనే అమలు చేయాలి అని కోరుతూ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు లో పిలుపునిచ్చారు.మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో 33 జిల్లాల ప్రధాన కేంద్రాలు ,హైద్రాబాద్ హెడ్ క్వార్టర్స్ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చారు. టిజేఏసి సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటించింది, సిపిఎస్‌ను వెంటనే రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలనే , కొనసాగించాలనే ప్రధాన డిమాండ్లతో 2004 సంవత్సరము నుండి ఎన్నో రకాల ఆందోళనలు, ఐక్య ఉద్యమాలు రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఉద్యోగ కమ్యూనిటీలు చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా యూనిఫైడ్ పెన్షన్(యుపిఎస్) విధానాన్ని తీసుకురావడం యావత్తు ఉద్యోగ కమ్యూనిటీని విస్మయానికి గురిచేస్తూ, తీవ్ర అసంతృప్తికి గురిచేసింది అని అన్నారు.తీవ్రంగా ఖండిస్తూ , వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఉద్యమాల్లో భాగంగా, తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావలసినదిగా కోరారు. సెప్టెంబర్ 1న అన్ని జిల్లాల ప్రధాన కార్యాలయాల వద్ద హైదారాబాద్ అమరవీరుల స్తూపం గన్ పార్క్ వద్ద ఉదయం 11.00గం.లకు 33 జిల్లాల జేఏసిలు, రాష్ట్ర జేఏసి ఆధ్వర్యంలో 205 భాగస్వామ్య సంఘాలతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్థామని అని అన్నారు. 10 లక్షల ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, అధ్యాపకులు, కార్మికులు, పెన్షనర్స్,అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ తదితర ఉద్యోగులందరి మనోభావాల, ఆత్మగౌరవాన్ని కాపాడుకొనే వారి ప్రాథమిక హక్కుల సాధనలో భాగంగా పెద్ద సంఖ్యలో, వేలాది మందితో పాల్గొని నిరసన కార్యక్రాన్ని జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, కరీంనగర్:** అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు సంబంధించిన సీఎం సహాయ నిధి చెక్కులను కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్ తన కార్యాలయంలో బాధితులకు నేరుగా అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ దురదృష్టవశాత్తు అనారోగ్యానికి గురై నిరుపేదలకు వైద్యం అందిం చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం చేసే సాంప్ర దాయం ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొనసాగిస్తుండడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలు, గ్రామాలు, డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి సంజీవిని లాంటిది

**విశ్వంభర, మర్పల్లి:** మర్పల్లి మండలం బూచన్ పల్లి గ్రామ అనుబంధ గ్రామమైన జాజిగుబ్బటి తండాకు చెందిన నిరుపేద కరంతోడు శ్రీనివాస్ తనయుడు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లగా అక్కడ డాక్టర్లు రూ. 1.50 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో ఈ విషయాన్ని వికారాబాద్ శాసనసభ్యులు శాసనసభాపతి గడ్డం ప్రసాద్



కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే రూ. 85 వేల ఇప్పించారు. బాధితుడికి శనివారం ఆయన ఎల్‌ఓసీని అందించారు. అడిగిన వెంటనే నిరంతరం పేద ప్రజల కోసమే పాటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ ప్రతి ప్రసాద్ కుమార్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు బీద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసమే కృషి చేస్తుందని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ సినియర్ నాయకుడు రాములు యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు టీ సురేష్, ప్రభాకర్ ఉన్నారు.ం

## నిబంధనలు పాటించాలి: ఏసీపి కృష్ణయ్య



**విశ్వంభరా, ఎల్బీనగర్:** గణేష్ మండప నిర్వాహకులు నిబంధ నలు తప్పకుండా పాటించాలని ఎల్బీనగర్ ఏసిపి ఏ కృష్ణయ్య అన్నారు. శనివారము చైతన్యపు రిలో గణేష్ మండప నిర్వహకుల అవగాహన సదస్సునుని ర్వహించారు. మండపాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుం డా చూసుకోవాలని, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసే సమయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. మండపాల వద్ద ఎవ రైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూ చించారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ పండుగను జరుపుకోవాలని కోరారు. సదస్సులు దాదాపు 75 మంది నిర్వాహకులు పాల్గొన్నట్లు తెలిపారు. చైతన్యపురి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి



**విశ్వంభర,రామన్నపేట:** రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటూ, వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్. మండల వ్యవసాయ అధికారి అజాజ్ అలీ ఖాన్, ఏఈవోలు ఎం శ్రీనివాస్, పి శ్రీనివాస్, రైతులు చల్ల సత్య ప్రకాష్, ఆవుల సత్యనారాయణ, ఆవుల శ్రీధర్, గంగుల రాంరెడ్డి, చల్ల అంజయ్య, కృపా సాగర్, చల్ల యాదయ్య పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో చేయని అభివృద్ధిని మేము చేసి చూపిస్తాం : జువ్వాడి నర్సింగరావు



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణం పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, పార్టీ విధేయులకు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా దరఖాస్తుల స్వీకరణ చేస్తుందన్నారు. పింఛనుదారులు, గృహజ్యోతి, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు గతంలో చేయని వారుదరఖాస్తు చేయడానికి వీలుకల్పిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గస్థాయిలో భారీగాచేరికలు అవుతున్నాయని అన్నారు. మెట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జట్టి లింగం, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లబ్ధి దారులకు చెక్కులను పంపిణీ



**విశ్వంభర, పరిగి:** పరిగి పట్టణంలోనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన26 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబాలకు 6 గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేసి నెరవేరుస్తామని అన్నారు. త్వరలో కళ్యాణ లక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ డబ్బులను వృధా చేయకుండా అవసరానికి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఆనంద్ రావు, డిసిసి ప్రదాన కార్యదర్శి హనుమంత్, డిసిసి ఉప అధ్యక్షుడలు లాలు కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరుశురాం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, ఆంజనేయులు,అక్బర్, రాధాకృష్ణ రెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా నాయకురాలు సురేఖ రెడ్డి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్దాం

## అన్ని శాఖల సమన్వయంతో గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి సాధ్యం: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగర అభివృద్ధికి జీహెచ్ఎంసీ, అన్ని అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట కోరారు. శనివారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో కమిషనర్ ఆమ్రపాలి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, అనుబంధ శాఖల అధికారులతో సిటీ అభివృద్ధి వేదికగా 66వ సిటీ కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ముందుగా గత సిటీ కన్వర్జెన్స్ సమావేశంలో తీసుకున్న ఎజెండా అంశాలలో చేపట్టిన పనులుపై చర్చించారు. అదే విధంగా ప్రస్తుత సమావేశంలో తీసుకోనున్న కొత్త ప్రతిపాదనలకు ప్రణాళికలు చేశారు. సిటీ అభివృద్ధిలో భాగస్వామ్య శాఖలైన ఆర్ అండ్ బి, మెట్రో రైల్వే, విద్యుత్, జాతీయ రహదారులు, ట్రాఫిక్, వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ, పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ శాఖ అధికారులతో కమిషనర్ ఆయా అంశాలపై సమీక్షించారు. జీహెచ్ఎంసీ ప్రగతికి ఆయా శాఖలు సంబంధిత సమస్యల పరిష్కారంపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పలుచోట్ల ఫ్లైఓవర్ నిర్మాణాలు,సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, కొత్త రోడ్డులను అభివృద్ధి చేయడం, జంక్షన్ డెవలప్మెంట్, ఫ్రీ లెఫ్ట్ లేదా ర్యాంపుల ఏర్పాటు, అండర్ పాస్ నిర్మాణాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ, బ్లాక్ పాయింట్స్ గుర్తించి తగిన చర్యలు చేపట్టడం, పలు పనులకు కావలసిన పరిపాలన మంజూరి, విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, తదితరాలపై ఆయా శాఖల అధికారులతో ప్రణాళికలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచడానికి, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే విధంగా గ్రేటర్‌లో అభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. సిటీ సమగ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో తీసుకున్న ఎజెండా అంశాలపై సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆయా శాఖల అధికారులను కమిషనర్ కోరారు. అంతకుముందు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ లు, ట్రాఫిక్ సీపీ నగరంలో రోడ్లు, జంక్షన్లు, ట్రాఫిక్ సమస్యలకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, చేపట్టాల్సిన చర్యల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కే శ్రీనివాస్ రెడ్డి, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ట్రాఫిక్ పోలీస్ అడిషనల్ కమిషనర్ ట్రాఫిక్ విశ్వనాథ్ ప్రసాద్, డెవిడ్, ఈ.ఎన్.సి జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, శివ కుమార్ నాయుడు, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, రఘు ప్రసాద్, సి.ఈ లు దేవానంద్, కోటేశ్వర రావు, జోన్ ఎస్.ఈ లు మహేశ్వర్ రెడ్డి, అశోక్ రెడ్డి, చిన్న రెడ్డి, శంకర్, అనిల్ రాజ్, రత్నాకర్, ఇరిగేషన్ ఎస్ ఈ శంకర్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఏ సి అడ్వర్టైజ్మెంట్ వేణుగోపాల్ రెడ్డి, హెచ్ ఆర్ డి సి ఎల్ ఎస్.ఈ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ ఈ.ఎన్.సి ప్రవీణ్ కుమార్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి




**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ , ఎస్టీ, బీసీ పోస్టు మెట్రిక్, ప్రి మెట్రిక్ హాస్టల్స్ లో చదువుతున్న విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దాంతోపాటు హాస్టల్స్ లో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హాస్టల్ వార్డెన్స్ రెగ్యులర్‌గా రాకపోవడంతో విద్యార్థులు వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో ఉన్నారని అన్నారు. హాస్టల్స్ కు వాటర్ సమస్య తీవ్రంగా ఉందని, రెండు రోజులకు ఒకసారి హాస్టల్స్ కు వాటర్ వస్తున్నాయన్నారు. తక్షణమే ఈ సమస్యలన్నీ దృష్టిలో ఉంచుకొని పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేసారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులతో జిల్లా కేంద్రాలలో, మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గోమాసా నరేష్, జిల్లా కమిటీ సభ్యులు అభి, శ్యాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల ధర్నాకు బీజేపీ నాయకుల మద్దతు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కాటారంలో ఆటోలో గుర్తు తెలియని మహిళా సారాతో ప్రయాణం చేస్తుండగా అనుమానం వచ్చి ఆటో డ్రైవర్ వెంటనే ఎక్సైజ్, అబ్కారి వారికీ ఇన్ఫర్మేషన్ ఇచ్చిన తర్వాత కూడా ఆ ఆటోని పట్టుకొని ఆటో సీజ్ చేసి, ఆటో డ్రైవర్ మీద అక్రమంగా కేసు బనాయించారని ఆటో డ్రైవర్లు ధర్న చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకుడు చల్లా నారాయణ రెడ్డి వెంటనే ఎస్పీతో, డిప్యూటీ కమీషనర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి అడుగుజాడల్లో నడుస్తూ ఎక్సైజ్ సీఐ అత్యుత్సాహం ప్రదర్శించి కేసు బనాయించారని విమర్శించారు. ఎక్సైజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు 420 ఉచిత హామీలు ఇచ్చి గద్దెనెక్కి కూర్చున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో డ్రైవర్లకు తగిన మూల్యం నెల నెల అందిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి ఇప్పుడు వాళ్ళ పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజల మన్ననలు పొందే విధంగా ఉండాలి తప్పా, ప్రజలను బెదిరించే విధంగా కాదని అన్నారు. హామీలను నెరవేర్చాలని బీజేపీ పార్టీ పక్షాన కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేస్తున్నామన్నారు.మంథని నియోజకవర్గ బీజేపీ పార్టీ కన్వీనర్ మల్క మోహన్ రావు, బీజేపీ మండల అధ్యక్షులు బండం మల్లా రెడ్డి, ఫిల్మ్ ఛాంబర్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, మాజీ అధ్యక్షులు సంపత్ రెడ్డి, చీర్ల తిరుపతి రెడ్డి, చీర్ల బాపు రెడ్డి, చల్లా మోహన్ రెడ్డి,డోలి అర్జయ్య, బండి రమేష్, వేణు నాయక్, లాకు నాయక్ ఉన్నారు.

## కాళేశ్వరంలో శని త్రయోదశి పూజలు




**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం శనివారం శనిత్రయోదశి సందర్భంగా భక్తులు ఆలయంలో నవగ్రహ పూజలు, కాలసర్పదోష పూజలు, స్వామివారి అభిషేకములు, అమ్మవారి కుంకుమార్చనలు నిర్వహించారు. పవిత్ర గోదావరి త్రివేణి సంగమంలో స్నానం ఆచరించిన భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. వివిధ పూజలపై, ప్రసాదాల అమ్మకం ద్వారా ఆలయానికి 3,66,000/-రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## సింగల్ విండో నూతన గోదాం ప్రారంభం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో నాబార్డ్ నిధుల నుంచి నిర్మించిన సింగల్ విండో నూతన గోదామును శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి వైస్ చైర్మన్ కూన రవికుమార్ సింగల్ విండో డైరెక్టర్లలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఫర్టిలైజర్, ధాన్యం కొనుగోలు, క్రాప్ లోన్ల విషయంలో సహకరిస్తున్న తలకొండపల్లి సొసైటీ అధ్యక్షుడు కేశవరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ సీఈవో లక్ష్మయ్య, పిసిసి కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డీ ప్రభాకర్ రెడ్డి, ఆమనగల్ డిసిసిబి బ్యాంక్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలి



**విశ్వంభర, తంగళ్లపల్లి:** వర్షాకాలం నేపథ్యంలో దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ హెచ్ సీ)ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఫార్మసీ, వ్యాక్సిన్ గది, ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. ఫిజియో థెరపీ సేవల రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఓపీ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో రక్త పరీక్షలు ఎక్కువ సంఖ్యలో చేయాలని సూచించారు. సీసీ టీవీ మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇక్కడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ, హోమియో డాక్టర్ డాక్టర్ దీప్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు: ఎస్పీ రూపేష్




**విశ్వంభర, సంగారెడ్డి :** జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 1వ తేది నుంచి 30వ తేదీ వరకు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

## పటాన్ చెరులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సుడిగాలి పర్యటన



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా నగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కు పంజా కొనసాగుతోంది. ఇప్పటికే పలు చోట్ల కూల్చివేతలు చేపట్టారు. శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పటాన్ చేరులో సుడిగాలి పర్యటన చేపట్టారు. మొదటగా పటాన్ చేరు సాకి చెరువును అక్రమ నిర్మాణాలను పరిశీలించిన వాటికి సంబంధించిన అనుమతుల వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం కబ్జాకు గురైన ప్రాంతాన్నిపరిశీలించారు. ఇప్పటికే చెరువులో 18 అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చెరువు వద్ద తూములు బంద్ చేసి ఇన్కోర్ సంస్థ అపార్టుమెంట్ కట్టినట్లుఆరోపణలు ఉన్నాయి. చెరువులు, కుంటలు, కాలువలతో పాటు లే ఔట్ స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులతో పాటు పత్రికలలో వచ్చిన కథనాలను ఆధారంగా చేసుకుని ఫిర్యాదులున్న వాటిని పరిశీలించారు. అక్కడి నుంచి అమీన్‌పూర్‌లోని శంబుని కుంట, సంబి చెరువులను ఆయన సందర్శించారు. చెరువులో కబ్జాలని పరిశీలించి ఇరిగేషన్ అధికారుల దగ్గర వివరాలనుతీసుకున్నారు. అనంతరం వెంకటరమణ కాలనీ ప్లాటు ఓనర్ల ఫిర్యాదు మేరకు వెంకట రమణ కాలనీని పర్యవేక్షించి ఆ కాలనీకి సంబంధించిన పార్కు స్థలాల వివరాలను ప్లాట్ ఓనర్లని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, స్థానిక టౌన్ ప్లానర్లు,జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మున్సిఫ్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 28వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి శనివారం పోలీస్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కక్షిదారులు రాజీద్వార తమ కేసులను పరిష్కరించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని ఆమనగల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప అన్నారు. బాధితులు పెద్ద సంఖ్యలో లోక అదాలత్‌కు హాజరై సమస్యలను రాజీమార్గంలో పరిష్కరించుకొని పోలీస్ కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. కావున కక్షిదారులు రాజీకొరకు లోకాదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో బీ కార్తీక్ ఏపీపీ ఆమనగల్, బీ ప్రమోద్ కుమార్ సీఐ ఆమనగల్, బీ వెంకటేష్ ఎస్ఐ ఆమనగల్, ఎస్ శివప్రసాద్ సీఐ కడ్తాల్, ఐ జగదీష్ సీఐ మాడుగుల్, ఏ శ్రీకాంత్ ఎస్ఐ తలకొండపల్లి, బధ్యానాయక్ ఎక్సైజ్ సీఐ అమనగల్లు, కోర్ట్ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ



**విశ్వంభర, చివ్వేంల:** మండలంలోని చందుపట్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రుణమాఫీ పథకంలో భాగంగా రేషన్ కార్డు లేని వారి దరఖాస్తులు స్వీకరించి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి డీ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం అయన మాట్లాడుతూ రుణ ఖాతా తీసుకున్న రైతు పేరు, ఆధార్‌లోని పేరులో మార్పులు ఉన్నట్లయితే సంబంధిత బ్యాంకులలో సెప్టెంబర్ నెల 7వ తేదీ వరకు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. మండలంలోని క్రాప్ లోన్ తీసుకొని రేషన్ కార్డు లేని వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, వెంకట్ రెడ్డి, శైలజ, రైతులు కలగాని వెంకన్న, శ్రీధర్ రెడ్డి, రమేశ్‌రావు, వెంకటేశ్వర రావు, బొమ్మగాని లక్ష్మయ్య, వెంకన్న, భద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విశ్వంభర, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్‌కు చెందిన వార్డ్ మెంబర్లు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ కాంగ్రెస్ పార్టీ చేరారు. మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

# అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

## కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు: కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచన మేరకు రాబోయే మూడు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక నేపథ్యంలో జిల్లాకి రెడ్ అలెర్ట్ ప్రకటించినట్టు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలకు స్పందించి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని వర్షాలు, వరదలు సంభవించినప్పుడులో లెవల్ కల్వర్టులు, నీరు చేరిన రహదారులు దాటకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయితీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళొద్దని పేర్కొన్నారు. పశువులను మేతకు బయటకు వదల కుండా ఇంటిపట్టునే ఉంచాలని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వ్యవసాయ పనులకు వెళ్ళొద్దని సూచించారు. జిల్లాలో పలిమల, మహాముత్తారం మండలాలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయని, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రాబోయే రెండు, మూడు రోజులు చాలా కీలకమని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను గుర్తించి ప్రజలు నివాసం ఉండకుండా తరలింపు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో పంచాయితీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో అత్యవసర సమయాలలో వినియోగించుకునే విధంగా గజఈత గాళ్లను సిద్ధంగా ఉంచాలని అన్నారు. జిల్లా స్థాయిలో 24 గంటలు పనిచేయు విధముగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు ఏదేని అత్యవసర సేవలకు 9030632608, 18004251123 కంట్రోల్ రూము నంబర్లకు కాల్ చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ విజయ లక్ష్మి, ఆర్డీవో మంగిలాల్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయక మండపాలకు అనుమతి కోసం, ఆన్‌లైన్లో అప్లికేషన్ అప్లై చేసుకొని, అట్టి అప్లికేషన్ ఫారంను ప్రింట్ తీసుకుని, వినాయక మండపం ఆర్గనైజర్ యొక్క ఆధార్ కార్డు జత చేసి పోలీస్ స్టేషన్ లో వివరాలతో ఇచ్చి, సహకరించాలని రామన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.మల్లయ్య పేర్కొన్నారు.

## బొడ్రాయికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**విశ్వంభర, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో బొడ్రాయి 10వ వార్షికోత్సావం సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ పీహెచ్‌సీ భవనం కోసం హెల్త్ కేర్ సెంటర్ సిబ్బంది అడుగగా త్వరితగతిన భవనం పనులు పూర్తి చేపిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. హాసన్ పర్తి మండల అధ్యక్షుడు పొరెడ్డి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి గౌడ్, డివిజన్ అధ్యక్షుడు అయ్యాల రాంరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సునీల్, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధితులకు మొబైల్ ఫోన్ల అందజేత



**విశ్వంభర, పరిగి :** సీఈఐఆర్ యాప్ ద్వారా 8 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి శనివారం బాధితులకు అందజేసినట్లు పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది వివిధ కారణాలతో సెల్ ఫోన్లను గత కొన్ని రోజుల క్రితం పోగొట్టుకొని పరిగి పోలీస్ స్టేషన్‌లో గత కొన్ని రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్ లను ట్రాక్ చేసి రికవరీ చేసి బాధితులకు అందజేశామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా తమ సెల్ ఫోన్‌ను పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

## నూతన డీసీసీబీ చైర్మన్‌కు ఘన స్వాగతం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి నూతనంగా ఎన్నికై మొదటిసారిగా ఆమనగల్లు మండల కేంద్రంలో పర్యటించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయనను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సహకార బ్యాంకు మేనేజర్ గోపాల్ సిబ్బందితో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ ఆమనగల్లు డీసీసీ బ్యాంకు ద్వారా 17 కోట్ల బంగారంపై రుణాలు అందివ్వడం జరిగిందని. డిసిసిబి బ్యాంకు సిబ్బంది డిపాజిట్లను, ఖాతాదారుల సంఖ్యను పెంచి బ్యాంకు అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేయడం జరిగిందని ఇందులో మా బ్యాంకు ముందంజలో ఉందని తెలిపారు. వివరాలకు డిసిసిబి బ్యాంకులో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు డిసిసిబి బ్యాంకు మేనేజర్ గోపాల్, ఫీల్డ్ సూపర్వైజర్ ఏపీ రాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## రామన్నపేటలో బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, రామన్నపేట:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలోని శ్రీ హిందూ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్.కే బాబా పాల్గొని సభ్యత్వ నమోదు వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరెకంటి మొగులయ్య, బిజెపి మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు కంబాలపల్లి సైదులు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు రమేష్, సభ్యత్వ కో-కన్వీనర్ రాపర్తి గణేష్, మండల ఉపాధ్యక్షులు మధ్యపురి ఐలయ్య, మండల కార్యదర్శి బట్టి రమేష్, భాస్క నరేష్, ముగ్గు నరసింహ, జంగిలి కోటిలింగం, గంగాదేవి ప్రశాంత్, వీరమల్ల సత్యనారాయణ, చాపల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మునిపంపులలోని మునీశ్వరుల గుట్ట మీద ఉత్సవాలు



**విశ్వంభర, రామన్నపేట :** రామన్నపేట మండలం, మునిపంపుల గ్రామంలోని మునీశ్వరుల గుట్ట మీద ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థలపురాణం ప్రకారం, పూర్వకాలంలో ఆ గుట్ట మీది సొరంగం గుహలలో మునీశ్వరులు తపస్సు చేసుకునేవారని, వారిని పూజించడానికి ఏటా శ్రావణ మాసం చివరి శనివారం, మునిపంపుల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ గుట్ట మీది గుహలలోని మునీశ్వరులను పూజించి ఎడ్ల బండ్లతో ఫలహారం బండ్లు గుట్ట చుట్టూ ప్రదక్షిణగా తిరుగుతూ, పప్పు, బెల్లం, ఎండు కొబ్బరిని ప్రసాదంగా అందరికీ పంచేవారు. ఇప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రతీ శ్రావణ మాసం చివరి శనివారం భక్తి శ్రద్ధలతో ఈ గుట్ట మీది మునులను స్మరించుకుని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ, ఫలహారపు బండ్లతో ప్రదక్షిణ చెస్తారు. మునీశ్వరులు తపస్సు చేసిన గుట్ట వలన ఈ గ్రామం పేరు మునిపంపులగా పిలవబడిందని గ్రామ ప్రజల నమ్మకం.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**విశ్వంభర, మేడిపల్లి:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధి బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యతిథిగా హాజరై మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తోటకూర వజ్రేశ్ యాదవ్‌లతో కలిసి లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఘట్కేసర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఘట్కేసర్ మండలం, ఘట్కేసర్ మున్సిపాలిటీ, పోచారం మున్సిపాలిటీ లకు మంజూరు అయినా షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. 49 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ చైర్మన్ పావని జంగయ్య యాదవ్, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు బిల్లులు




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో రోజ్గార్ దివస్ సందర్భంగా ఎంపీడీవో కుసుమ మాధురి పర్యటించారు. ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వారికి పేస్లిప్లను అందజేశారు. నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై అధికారులకు పలు సూచనలు చేశారు..

## ఉపాధ్యాయులకు సన్మానం చేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి రూరల్ మండలం గొల్ల బుద్ధారం గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి అధ్యక్షతనలో పదోన్నతులతో వేరే స్కూళ్లకు వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కార్యక్రమంలో పాల్గొని టీచర్లను సత్కరించారు. మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎక్కడ పని చేసిన సమయపాలన తప్పక పాటించాలన్నారు. పనిచేసిన చోటల్లా విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తే వారిని చిరస్థాయిగా గుర్తుంచుకుంటారన్నారు. పాఠశాలలోని నూతన డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఎమ్మెల్యే ప్రారంభించారు.

## సీసీ కెమెరాల వినియోగంపై పోలీసుల అవగాహన



**విశ్వంభర భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సీసీ కెమెరాల వినియోగం పై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై చక్రపాణి, మహాదేవపూర్ సిఐ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో హెూటల్స్,లాడ్జ,కిరాణ దుకాణాల నిర్వాహకులతో కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తో కలిసి మహదేవపూర్ సిఐ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని , మూడో నేత్రంగా పనిచేస్తూ నేరస్తులను గుర్తిస్తుందని అన్నారు. రాత్రింబవళ్లు గస్తీ కాసే పోలీసుల లా సీసీ కెమెరాలు పనిచేస్తాయని, అనుమానిత వ్యక్తులకు లాడ్జ్ నిర్వాహకులు గదులు కిరాయికి ఇవ్వరాదని సూచించారు.



**విశ్వంభర, ఆత్మకూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కుర్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన దొమ్మేటీక నాగరాజు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.**

## ప్రతి ఒక్కరు కోట మైసమ్మ, ముత్యాలమ్మ అనుగ్రహం పొందాలి

**విశ్వంభర, చింతపల్లి:** ప్రతి ఒక్కరూ గ్రామ దేవతలైన శ్రీ కోట మైసమ్మ, ముత్యాలమ్మ అనుగ్రహం పొందాలని చింతపల్లి మండలం వింజమూరు అఖిలపక్ష నేతలు అన్నారు. శనివారం వింజమూరు గ్రామంలో బోనాల పండుగ సందర్భగా గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీ కోట మైసమ్మ అమ్మవారికి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీల అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ఇస్తున్న సందేశం ఏమిటి?

■ శాసన సభ్యుడినీ అగౌరవపర్చడమా? ■ ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకుడు నల్ల చంద్ర స్వామి మాదిగ

■ ప్రోటోకాల్ విస్మరించిన అధికారులపై, ఎమ్మెల్యే వీరేశాన్ని అడ్డుకున్న పోలీస్ అధికారులపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నీటిపారుదల శాఖ పనులపై సమీక్ష సమావేశం కోసం ముఖ్య అతిథులుగా విచేస్తున్న తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను సమావేశానికి ఆహ్వానించడం కోసం మిగతా ప్రజా ప్రతినిధులతో పాటు హెలిపాడ్ దగ్గరకు వెళ్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే మాదిగ జాతీ ముద్దు బిడ్డ వేముల వీరేశాన్ని వెళ్లనివ్వకుండా ప్రోటోకాల్ విస్మరించి పోలీస్ అధికారులు అడ్డుకోవడం విచారకరం. ఈ సంఘటన యావత్ మాదిగ, దళిత, పీడిత వర్గాల సమాజాన్ని కలచి వేసింది. ఒక నియోజకవర్గానికి రాజ్యాంగ బద్దంగా ప్రజల ఓట్లతో ఎన్నికైన శాసన సభ్యుడినే ప్రోటోకాల్ పాటించకుండా అడ్డుకోవడంతో సాధారణ సగటు సమాజానికి అధికారులు ఎలాంటి సందేశం ఇస్తున్నారని, ఇది పీడిత వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అని ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే ఎమ్మెల్యే వేముల వీరేశంకు పీడిత వర్గాల సమాజానికి క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పియాస్ రాష్ట్ర నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ అన్నారు. శాసన సభ్యులు ప్రోటోకాల్ పరిధిలో వస్తారని మరి ఎమ్మెల్యే వీరేశం పేరు ప్రోటోకాల్ జాభితాలో చేర్చలేదా? చేర్చకుంటే ప్రోటోకాల్ జాభితా రూపొందించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేదా ప్రోటోకాల్ జాభితాలో ఎమ్మెల్యే వీరేశం పేరు చేర్చినా కూడా భద్రత కల్పిస్తున్న పోలీస్ అధికారులు ఉద్దేశ్య పూర్వకంగా అడ్డుకుంటే ఆ అడ్డుకున్న పోలీస్ అధికారులపై విచారణ జరిపి సంఘటనకు కారకులేవరో తేల్చి ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలిఅని పునరావృతం కాకుండా చర్యలు తీసుకో వాలిఅన్నారు. పీడితవర్గాలసమాజాన్నిఏకంచేసి ఉద్యమాలు చెపడుతామని అన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**విశ్వంభర, ఖమ్మం:** భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిందని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ప్రజలు సహాయానికి 24/7 ఫోన్ నెం. 9063211298, టోల్‌ఫ్రీ నెం. 1077కు కాల్ చేయాలని ఫోన్ నెంబర్‌కు వాట్సాప్ కూడా చేయవచ్చని తెలిపారు. జిల్లాలోని చెరువులు నీటి వనరులపై నిఘా పెట్టాలని అన్నారు. చెరువులు వాగుల్లోకి ప్రజలు వెళ్ళకుండా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న చెరువులు రిజర్వాయర్లు కాల్వల నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన సూచించారు. జిల్లాలోని చెరువులు కుంటలు వాగులు వంకల వద్ద మత్తడి పొంగిపొర్లే ప్రాంతాలను గుర్తించి 24 గంటలు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. జిల్లా అధికారులు తహసిల్దారులు ఎంపిడిఓ ఎంపివోలు భారీ వర్షాల నేపథ్యంలో హెడ్‌క్వార్టర్‌లో ఉండి సమన్వయంతో పనులు చేయాలన్నారు. చెరువులు వాగుల వద్ద చేపలు పట్టడానికి అనుమతించవద్దని ఆయన అన్నారు. కల్వర్టులు రోడ్లపై ప్రవాహాలు వున్నచోట రహదారిని మూసివేయాలని ప్రజలు దాటకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. నీటి ప్రవాహాల వద్ద వలంటీర్లను ఉంచాలన్నారు. బ్యారికేడేస్ అవసరం ఉన్న ప్రతిచోట పెట్టాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం అందుబాటులో ఉంచుకొని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎలాంటి ప్రాణ ఆస్థి జంతు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. దామిని యాప్ గురించి అవగాహన కల్పించి పిడుగు పాటు నుండి రక్షణ పొందేలా చైతన్యం తేవాలన్నారు. నీటి ప్రవాహాల వద్ద వలంటీర్లను ఉంచాలన్నారు. బ్యారికేట్స్ అవసరం ఉన్న ప్రతిచోట పెట్టాలన్నారు. ఈ సమీక్షలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జెడ్పి సిఇఓ దీక్ష రైనా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి నాగలక్ష్మి, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ఎంపిఓలు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి




**విశ్వంభర, వికారాబాద్:** ప్రభుత్వ ఉద్యోగంలో బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడు జీవితంలో ఎంతో సంతృప్తిని కలుగజేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగ పదవీ విరమణ పొందిన జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం పబ్లిసిటీ అసిస్టెంట్ కే. జ్ఞానేశ్వర్ కు జిల్లా కలెక్టర్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పదవి విరమణ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. పదవీ విరమణ సందర్భంగా కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడు అధికారుల మన్ననలు పొందడమే కాకుండా వ్యక్తిగత సంతృప్తిని కలగజేస్తుందని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అయినప్పటికీ ఎన్నో సంవత్సరాలుగా సహ ఉద్యోగులతో పనిచేసే క్రమంలో బాధను కలిగించడం సహజమని ఆయన అన్నారు. 30 సంవత్సరాలుగా పబ్లిసిటీ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన జ్ఞానేశ్వర్ ను తమ అభీష్టం మేరకు ఫోటోగ్రఫీలో తమ నైపుణ్యాన్ని చాటుకోవాలని అదేవిధంగా తన జీవితంలో కుటుంబంతో సుఖ సంతోషాలతో గడపాలని కలెక్టర్ అభిలషించారు. ముందుగా పదవి విరమణ పొందిన మిషన్ భగీరథ ఇఇ బాబు శ్రీనివాస్ ను జిల్లా కలెక్టర్ తన చాంబర్ లో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో ఉన్న అనుభూతిని పంచుకున్నారు. జ్ఞానేశ్వర్‌ను అధికారులు, పాత్రికేయులు, సహచరులు ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. పదవి విరమణ సందర్భంగా తెలంగాణ సాం స్కృతిక కళాకారుల గేయాలు ఆహుతులను ఏంతగానో ఆకర్షించాయి. పదవీ విరమణ కార్యక్ర మంలో జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, డివైఎస్ఓ హనుమంతరావు, డిఎస్సీడిఓ మల్లేశం, మెప్మా పిడి రవికుమార్, మాజీ డిపిఆర్ఓ నర్సింలు, సమాచార పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ధారూర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, వికారాబాద్:** అకాల వర్షాల కారణంగా ధారూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధారూర్ మండల టిఆర్ఎస్ మాజీ వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ అన్నారు. శనివారం ధారూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ, అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని పేర్కొ న్నారు. తడి చేతులతో విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని అన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ప్రజలు నివసించరాదని పేర్కొన్నారు. రైతులు పొలాలవద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలుపాటించాలని, పిడుగులుపడే అవకాశాలు ఉన్నాయని, చెట్లకింద ఉండకుండాజాగ్రత్తవహించా లని అన్నారు.

# భారీ వర్షాల వలన అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదు
- నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించరాదు
- నవాబ్ పెట్ ఎస్సై అరుణ్ కుమార్




**విశ్వంభర, వికారాబాద్ ప్రతినిధి:** భారీ వర్షాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవాబ్ పేట ఎస్సై అరుణ్ కుమార్ అన్నారు. శనివారం నవాబ్ పెట్ మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించరాదని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని అన్నారు. వికారాబాద్ జిల్లాను ఆరంజ్ జోనుగా పరిగణించినందువలన నవాబు పేట్ మండల ప్రజలు ఎటువంటి వాగులు వంకలు దాటకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా నది పరివారక ప్రాంతాలు చించల్ పెట్, గంగ్యాడ ,ముబారక్పూర్ గ్రామాల ప్రజలు, మూసీ నది పరివాహ ప్రాంతంలో ఉన్న ప్రజలు నదిని దాటకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.పిడుగులు పడే అవకాశం ఉన్నందువలన కరెంటు స్తంభాల కింద చెట్ల కింద నిలబడకూడదని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం కొరకు 24 గంటలు మా నవాబ్ పెట్ పోలీసులు అందుబాటులో ఉంటారని, అత్యవసరమైన సమయంలో ప్రజలు డయల్ 100 కు ఫోన్ చేయాలని అన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మర్పల్లి ఎస్సై సురేష్



**విశ్వంభర,వికారాబాద్:** భారీ వర్షాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్పల్లి ఎస్సై సురేష్ అన్నారు. శనివారం మర్పల్లి ఎస్సై సురేష్ మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించరాదని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని అన్నారు. వికారాబాద్ జిల్లాను ఆరంజ్ జోనుగా పరిగణించినందువలన మర్పల్లి మండల ప్రజలు ఎటువంటి వాగులు వంకలు దాటకూడదని పేర్కొన్నారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందువలన కరెంటు స్తంభాల కింద చెట్ల కింద నిలబ డకూడదని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం కొరకు 24 గంటలు మా మర్పల్లి పోలీసులు అందుబాటులో ఉంటారని అందుకుగాను డయల్ 100కు గాని, 8712670038 నెంబర్ కు ఫోన్ చేయగలరని పేర్కొన్నారు.

## ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- పాడుబడ్డ ఇండ్లలో ప్రజలు ఉండకుండా జాగ్రత్త వహించాలి?.
- పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఎక్కడైనా పంట నష్టం జరిగితే వెంటనే నివేదిక సిద్ధం చేసి రిపోర్ట్ అందజే యాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**విశ్వంభర,వికారాబా:** జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రజలందరు అప్రమత్తం గా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటన తెలిపారు. శనివారం జిల్లా లో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు , మున్సిపల్ కమిషనర్లు అందరు అప్రమత్తం గా ఉండాలని,ఎడతెరపి లేని వర్షాలు, గ్రామాలు, జిల్లాలో ఎడతెరపి లేని వర్షా లు కురుస్తున్నాయని, రానున్న రెండు మూడు రోజులు సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించినందున ఎక్కడ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పాతబడిన మిద్దెలు ఉండి శిథిలావస్థకు చేరు కొని ఉంటే అలాంటి వాటిని గుర్తించి వెంటనే అందులో నుంచి కుటుంబాలను ఖాళీ చేయించి సుం`క్షిత ప్రాంతాలకు తరలించాలని, మురుగు కాలువలు అన్ని శుభ్రం చేయించాలని ఎక్కడ కాలువలు నిండిపోయి ఓవర్ఫ్లో కాకుండా చూసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంటుంది కాబట్టి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా పంట నష్టం జరిగితే వెంటనే నివేదిక సిద్ధం చేసి పంపించెందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్దంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని, పాతబడి కుంగిపోయిన విద్యుత్ స్తంభాలు ఉంటే వెంటనే మార్చాలని, వైర్లు కిందికి వేలాడకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికా రులకు సూచించారు. ఎక్కడైనా ఏవైనా సమస్య ఉత్పన్నం అయితే వెంటనే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని. కలెక్టరెట్ కార్యాలయం 8416242136 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారమివ్వాలని సూచించారు.జిల్లా ఎస్పీ తో కలిసి జిల్లా కలెక్టర్ టే లి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు.రానున్న మూడు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, ముందస్తు గా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ఎమ్మెల్సీ కోదండరాంకు ఆత్మీయ పౌర సన్మానం




**విశ్వంభర, హైద్రాబాద్:** తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండ రామ్ కు ఆత్మీయ పౌర సన్మానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ బదురుద్దీన్ తెలిపారు. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య అధ్యక్షతన నాంపల్లి టి జే ఎస్ కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆత్మీయ పౌర సన్మాన సభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బద్రుద్దీన్ మాట్లాడుతూ కోదండ రాముకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం పట్ల తెలంగాణ ప్రజానీకం సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్, రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, కొత్త రవి, హనుమంత్ రెడ్డి పుష్కలత, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్ నగర నాయకులు రవికాంత్, మానేపల్లి లక్ష్మణ్ , మెరుగు శ్రీనివాస్ యాదవ్,ఎస్ సురేష్ జైపాల్ రెడ్డి, కాకునూరి సుధాకర్, హనుమంతు గౌడ్, ఎల్లయ్య, వీరన్న, సుధాకర్, అఫ్జల్, భూషణ్, శ్రవణ్ కుమార్, కే రాజు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల పెన్షన్ డబ్బులు వెంటనే చెల్లించాలి.



**విశ్వంభర, భూపాలపల్లి:** వికలాంగుల పెన్షన్ ఇప్పటి వరకు బ్యాంకుల్లో పడకపోవడం శోచనీయం అని భూపాలపల్లి జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు మాచర్ల వంశీకృష్ణ గౌడ్ అన్నారు. వికలాంగులకు 6000 పెన్షన్ పెంచుతానని చెప్పిన రేవంత్ రెడ్డి ఇంతవరకు పింఛన్ పెంచకపోవడం బాధాకరమని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వికలాంగులు తమ అవసరాల నిమిత్తం పింఛన్ పై ఆధారపడి జీవిస్తున్నారని, పింఛన్ కోసం చూసి చూసి మా కనులు కాయలు కాచాయని అన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు కూడా వికలాంగులను చిన్న చూపు చూడడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు.

# 500 గ్రాముల గంజాయి పట్టివేత



**విశ్వంభర, మేడిపల్లి:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ ఓ టి పోలీస్ సిబ్బంది మేడిపల్లి పోలీసులు జాయింట్ ఆపరేషన్ లో శనివారం అనుమానస్పదంగా తిరుగుతున్న మహమ్మద్ సలీంను పట్టుకున్నారు. అతని దగ్గర 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. సలీం పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విద్యార్థులు, యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి సూచించారు.

## కోట్ల విలువ చేసే రికార్డులు నీళ్ల పాలు



**విశ్వంభర, కోదాడ :** విస్తారంగా కురుస్తున్న కుండ పోత వర్షంతో కోదాడ మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలోకి మూడు అడుగుల మేర వర్షపు నీరు చేరడంతో కోట్లాది రూపాయల విలువ చేసే రికార్డులు, మున్సిపల్ పరిధిలోని కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన ఎంబీలు, నిధులకు సంబంధించిన రికార్డులు తడిసి ముద్దయ్యాయి. దీనికి తోడు కార్యాలయంలో ఫాగింగ్ మిషన్లు, బీరువాలు, బీరువాలో ఉన్నటువంటి రికార్డులు సైతం తడిసి ముద్దయ్యాయి. కోదాడ పట్టణంలోని పలు కాలనీల్లో నీళ్లు నిలిచిపోయాయి.

## రూల్స్ బ్రేక్ చేస్తున్న ఏ హాస్పిటల్‌ను వదలొద్దు : మంత్రి దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, హైద్రాబాద్:** డెంగ్యూ పేరిట దోపిడీ ఎక్కువైందని, డైలీ ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులకు హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ హాస్పిటల్స్ గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూల్స్ బ్రేక్ చేస్తున్న ఏ హాస్పిటల్‌ను వదలొద్దని స్పష్టం చేశారు. కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి డెంగీ దోడిపీని నియంత్రించాలని, పేషెంట్లు ఫిర్యాదు చేసేందుకు కూడా ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా వాస్తవ పరిస్థితులను గుర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదు అయ్యే హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్



**విశ్వంభర, వికారాబాద్ టౌన్:** రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల వికారాబాద్ పట్టణ ప్రజలందరు జాగ్రత్తగా ఉండాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండు మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది అందరు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ కూడా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న గృహాలు ఉంటే అలాంటి వాటిని గుర్తించి వెంటనే అందులో నుంచి కుటుంబాలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, మురుగు కాలువలు అన్ని శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, ఎక్కడ కాలువలు నిండిపోయి ఓవర్ ఫ్లో కాకుండా చర్యలు చేపట్టాలి అన్నారు. కాలనీలలో రోడ్డు పక్కన ఎక్కడ కూడా నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంటుంది కాబట్టి పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుంది అన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో ఫాగింగ్ కూడా చేయడం జరుగుతుందని చైర్ పర్సన్ గారు వెల్లడించారు. ప్రజలు ముఖ్యంగా చిన్నారులు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసరం ఉంటే తప్ప బయటకి వెళ్లకూడదని, ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ : 9398227053 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మహిళలపై నేరాలు తీవ్ర ఆందోళనకరం

**ఈ కేసుల్లో విచారణ వేగవంతంగా జరగాలి : ప్రధాని మోదీ**

**ఢిల్లీ:** సమాజంలో మహిళలపై నేరాలు ఆందోళనకరంగా మారాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఇలాంటి కేసుల్లో వేగంగా విచారణ పూర్తి చేసి శిక్షలు విధించాలన్నారు. ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి జిల్లా న్యాయసేవా సదస్సులో ఈ మేరకు మాట్లాడారు. సుప్రీం కోర్టుకు 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా స్టాంప్‌ను విడుదల చేశారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వర న్యాయం జరగాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అలా జరిగితేనే మహిళల భద్రతకు మరింత భరోసానిస్తుందని తెలిపారు. న్యాయవ్యవస్థను రాజ్యాంగాన్ని పరిరక్షుడిగా పరిగణిస్తున్నామని, సుప్రీం కోర్టు, న్యాయవవస్థ తమ బాధ్యతను నిర్వర్తించిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు లేదా న్యాయవ్యవస్థపై భారత ప్రజలు ఎప్పుడూ అపనమ్మకం చూపలేదని తెలిపారు.

# 'కాంగ్రెస్‌లో చేరుతున్నారా?'

**వినేశ్‌ఫోగాట్‌ను ప్రశ్నించిన విలేకరి**

**ఢిల్లీ:** హరియాణాలోని అంబాలా సమీపంలోని శంభూ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఆందోళనకు ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ మద్దతు తెలిపారు. వారి డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. శంభూ సరిహద్దు వద్ద కొనసాగిస్తున్న ఆందోళనలు 200వ రోజుకు చేరిన సందర్భంగా రైతులకు వినేశ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా "మీరు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారా?" అని ఓ విలేకరి ప్రశ్నించారు.అయితే రాజకీయాలు మాట్లాడదలచుకోలేదని వినేశ్ స్పష్టంచేశారు. రైతు కుటుంబాల్ని కలుసుకోవడానికే తాను వచ్చానని తెలిపారు. మీడియా దృష్టి తన వైపు తిప్పితే రైతుల పోరాటం, కష్టాలు వృథా అవుతాయని వినేశ్ అభిప్రాయపడ్డారు. క్రీడాకారిణిగా, భారతీయురాలిగా తనకు ఎన్నికలపై ఎలాంటి ఆందోళన లేదని రైతుల సంక్షేమంపై మాత్రమే దృష్టి ఉందని చెప్పారు. మన హక్కుల కోసం మనమే నిలబడాలని, వాటిని సాధించుకోకుండా వెను దిరగవద్దని రైతులకు ఫోగట్ సూచించారు. రైతుల డిమాండ్లు నెరవేరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

అంతవరకు వెనక్కి తగ్గొద్దు

"రైతు కుటుంబంలో పుట్టడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. మీ కుమార్తె మీతోనే ఉందన్న విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను. మన హక్కుల కోసం మనమే నిలబడాలి. మనకోసం ఎవరూ రారు. మీ డిమాండ్లు పూర్తి కావాలని ఆ భగవంతుడ్ని నేను ప్రార్థిస్తున్నాను. వాటిని సాధించుకోకుండా వెనుదిగొద్దు. ఇక్కడున్న రైతులు తమ హక్కుల కోసం 200 రోజులుగా కూర్చొని ఉన్నారు. ఈ డిమాండ్లను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను. కానీ, కేంద్రం ఇన్నాళ్లుగా మీ డిమాండ్లు వినకపోవడం ఎంతో బాధాకరం" అని వినేశ్ పేర్కొన్నారు.

ఆందోళనలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు రైతు నేత స్వర్ణ సింగ్ పంధేర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వారి దీక్షను పరీక్షిస్తోందని పేర్కొన్నారు. మరోసారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, దీంతోపాటు కొత్త అంశాలను కూడా ప్రకటిద్దామని పంధేర్ రైతులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దిల్లీలో ర్యాలీకి అధికారులు నిరాకరించిన కారణంగా రైతులు ఫిబ్రవరి 13 నుంచి శంభూ సరిహద్దుల వద్దే ఆందోళన చేపట్టారు. పంటలకు చెల్లించే కనీస మద్దతు ధరకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలంటూ రైతులు డిమాండ్ చేశారు.

# హరియాణా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ 5కు వాయిదా.. 8న కౌంటింగ్

**న్యూఢిల్లీ:** హరియాణా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీని ఎన్నికల సంఘం (ఈసీ) వాయిదా వేసింది. ముందుగా ప్రకటించిన అక్టోబర్ 1కి బదులు అక్టోబర్ 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు శనివారం తెలిపింది. అయితే అక్టోబర్ 1న జరగనున్న జమ్ముకశ్మీర్ ఎన్నికల మూడో దశ పోలింగ్ తేదీలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. జమ్ముకశ్మీర్, హర్యానా ఎన్నికల కౌంటింగ్, ఫలితాల తేదీని అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 8కు మార్పు చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. కాగా, శతాబ్దాల నాటి అసోజ్ అమావాస్య ఉత్సవాల్లో పాల్గొనేందుకు హరియాణాలోని బిష్ణోయ్ కమ్యూనిటీ ప్రజలు రాజస్థాన్‌కు భారీగా తరలివెళ్లడంపై జాతీయ, రాజకీయ పార్టీలు, అఖిల భారత బిష్ణోయ్ మహాసభల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఈసీ తెలిపింది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోవడం, హరియాణా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతంపై ప్రభావం చూపవచ్చన్న వాదనలతో హర్యానా ఎన్నికల పోలింగ్ తేదీతోపాటు కౌంటింగ్ తేదీని మార్పు చేసినట్లు పేర్కొంది.

# 22 మందితో హెలికాప్టర్ అదృశ్యం

**రష్యాలో ఘటన.. గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు**

మాస్కో: రష్యా లో ఓ హెలికాప్టర్ మిస్సైంది రష్యన్ ఫార్ ఈస్ట్‌లోని కమ్‌చట్కా ద్వీపకల్పంలో 22 మందితో ప్రయాణిస్తున్న రష్యన్ Mi8 శ్రేణికి చెందిన హెలికాప్టర్ అదృశ్యమైనట్లు రష్యా ప్రభుత్వ మీడియా తెలిపింది. 22 మందిలో 19 మంది ప్రయాణికులు కాగా, మరో ముగ్గురు సిబ్బంది. ఈ విషయాన్ని ఫెడరల్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ కూడా ధ్రువీకరించింది. మిస్సైన హెలికాప్టర్ ద్వీపకల్పంలో పర్యాటక యాత్రలను నిర్వహించే విత్యాజ్ ఏరో ఎయిర్‌లైన్‌కు చెందినదని స్థానిక మీడియా నివేదించింది. వచ్కాజెట్స్ అగ్నిపర్వతం సందర్శన సమయంలో ఇది అదృశ్యమైనట్లు పేర్కొంది. కమ్‌చట్కా ప్రాంతంలోని వాచ్‌కాజెట్స్ నుంచి బయల్దేరిన ఈ హెలికాప్టర్.. షెడ్యూల్ ప్రకారం గమ్యస్థానానికి చేరుకోలేదని తెలిపింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు హెలికాప్టర్ కోసం గాలింపు చేపడుతున్నారు.

**ఢిల్లీ కోచింగ్ సెంటర్ కేసులో**

# ఆరుగురు నిందితులకు సీబీఐ కస్టడీ

**ఢిల్లీ:** దఇల్లీ కోచింగ్ సెంటర్ మరణాల కేసు లో రౌస్ ఎవెన్యూ కోర్టు శనివారంనాడు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో అరెస్టయిన ఆరుగురు నిందితులను నాలుగు రోజుల సీబీఐ కస్టడీకి కోర్టు ఆదేశించింది. నిందితులు అభిషేక్ గుప్తా, దేశ్‌పాల్ సింగ్, తేజిందర్ సింగ్, హర్వీందర్ సింగ్, సరబ్‌జిత్ సింగ్, పర్వీందర్ సింగ్‌లను సెప్టెంబర్ 4వ తేదీ వరకూ సీబీఐ కస్టడీకి ఇస్తూ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నిషాంత్ గార్గ్ ఆదేశాలిచ్చారు. ఆగస్టు 2వ తేదీన హైకోర్టులో ఉత్తర్వులో పేర్కొన్న అంశాలు, ఇన్వెస్టిగేషన్ పరిధిని పరిగణనలోకి తీసుకుని నిందితుల కస్టోడియల్ ఇంటరేగేషన్ తప్పనిసరని కోర్టు ఏకీభవిస్తున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోకి వరదనీరు ముంచెత్తడంతో ముగ్గురు విద్యార్థులు ఇటీవల దుర్మరణం పాలైన ఘటన దిల్లీని కుదిపేసింది.

# జపాన్‌లో ఇక వారానికి 4 రోజులే పని

**అన్ని సంస్థల్లో అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం**

**టోక్యో:** జపాన్ పౌరులు వర్క్‌హాలిక్స్‌గా పేరు పొందారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అణుబాంబులు జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలను నేలమట్టం చేసినా, పట్టుదలతో ముందడుగు వేసి అభివృద్ధి చెందిన దేశంగా జపాన్‌ను నిలిపారు. ఎంతో క్రమశిక్షణగా ఉంటూ, దేశాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. పని విషయంలో పడి వారు వ్యక్తిగత జీవితాన్ని కూడా పట్టించుకోవడం లేదు. ఆఖరికి సంసార జీవితంపైనా దృష్టి పెట్టడంలేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పని దినాల విషయంలో జపాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు వారానికి నాలుగు రోజులు మాత్రమే పని చేయాలని సూచించింది. ఈ విధానం అన్ని సంస్థల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ విధానాన్ని 2021లోనే అమలు చేయాలని జపాన్ నిర్ణయం తీసుకుని.. ఆదేశాలు కూడా జారీ చేసింది. అయితే చాలా సంస్థలు ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. ఇలా చేయడం వల్ల అభివృద్ధి విషయంలో కొంత కాలానికి జపాన్ వెనుకపడే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రస్తుతానికి 8 శాతం సంస్థలు జపాన్ ప్రభుత్వ నిర్ణయం మేరకు 4 రోజుల పనిదినాన్ని అనుసరిస్తున్నాయి. మిగిలిన సంస్థలు కూడా తమ ఉద్యోగులతో వారానికి నాలుగుసార్లు మాత్రమే పని చేయించుకోవాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల్లో మరింత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించవచ్చని వివరించింది. ఈ విధానంతో నిరుద్యోగిత రేటు కొంతైనా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడింది. తక్కువ పని దినాలు ఉండడం వల్ల కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతూ పిల్లల పెంపకంపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని జపాన్ ప్రభుత్వం తమ ఆదేశాల్లో పేర్కొంది. వారానికి నాలుగు పని దినాల విధానాన్ని ప్రస్తుతం టోక్యోలోని అకికో యోకోహామా అనే సంస్థ పాటిస్తోంది. ఉద్యోగులకు శని, ఆదివారాలతో పాటు బుధవారం సెలవులను ఇస్తోంది. ఈ విధానం ఉద్యోగులు ఒత్తిడికి గురి కాకుండా చురుగ్గా పని చేస్తున్నారని యాజమాన్యం పేర్కొంది. తక్కువ పని దినాలు ఉండటంతో ఉద్యోగులు మరింత వేగంగా పనులను పూర్తి చేస్తున్నారని వెల్లడించింది. జపాన్‌లో ఎక్కువశాతం ఉద్యోగస్తులు ఓవర్ టైం డ్యూటీలు చేయడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు ఎదుర్కొంటున్నారని ఓ నివేదిక వెల్లడించింది.

# ఈ నెలలో భారీ వర్షాలు, వరదలు

- వాతావరణ విభాగం అంచనా
- వివరాలు వెల్లడించిన ఐఎండీ డైరెక్టర్ జనరల్



**ఢిల్లీ:** దేశంలో సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. అలాగే వాయువ్య భారతదేశం, దాని పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీర్ఘకాల సగటు వర్షపాతం 167మి.మీలో 109 శాతంగా ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహపాత్ర వివరాలు వెల్లడించారు.

"సెప్టెంబరులో ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పరిసర ప్రాంతాలు సహా వాయువ్య భారతదేశంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల వరదలు రావొచ్చు. కొండచరియలు, మట్టి దిబ్బలు విరిగి పడే అవకాశం కూడా ఉంది. అందుకే ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి. సెప్టెంబరులో ప్రతివారానికొకసారి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణుల ఏర్పడే అవకాశం ఉంది. ఇవి పశ్చిమ వాయువ్య దిశగా రాజస్థాన్ వైపు వెళ్లొచ్చు. అలాగే హిమాలయాల వైపు మారొచ్చు. ఈ అల్పపీడన ద్రోణుల వల్ల దేశవ్యాప్తంగా గణనీయమైన మొత్తంలో వర్షాలు కురుస్తాయి" అని మృత్యుంజయ్ మహపాత్ర వివరించారు.


ఆగస్టులో దంచి కొట్టిన వానలు

దేశంలో ఆగస్టులో సాధారణ వర్షపాతం కంటే 16 శాతం ఎక్కువ నమోదైందని ఐఎండీ డైరెక్టర్ మృత్యుంజయ్ మహపాత్ర తెలిపారు. వాయువ్య భారతదేశంలో 253.9 మిమీ వర్షపాతం నమోదైందని వెల్లడించారు. 2001 నుంచి ఆగస్టులో ఇదే అత్యధిక వర్షపాతం అని పేర్కొన్నారు.

"ఆగస్టులో దేశంలో 287.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జున్ 1న భారత్ లోకి రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి 749 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హిమాలయాల దిగువన, ఈశాన్య ప్రాంతాల్లోని అనేక జిల్లాలు సాధారణం కంటే తక్కువ వర్షం పడింది. అలాగే కేరళ, మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో ఆరు అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డాయి. వాటిలో రెండు అల్పపీడనంగా మారాయి. " అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహపాత్ర పేర్కొన్నారు.

# 'లైసెన్స్ టు రైట్' కావాలన్న శశిథరూర్

- గత అనుభవాన్ని గుర్తుచేసుకున్న నేత



**ఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు ప్రజా ప్రతినిధిగానే కాదు రచయితగా, వక్తగా ఎంతో గుర్తింపు ఉంది. తన ఆంగ్ల భాష పరిజ్ఞానంతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు. రాయడమంటే అమితాసక్తి ఉన్న ఆయన, పదేళ్ల వయసులోనే పత్రికల్లో రచనలు ప్రచురితమయ్యాయి.

అయితే 1970వ దశకంలో ఐరాసలో చేరిన సమయంలో రచన విషయంలో ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు శశి థరూర్. జేమ్స్ బాండ్‌కు చంపేందుకు లైసెన్స్ ఉన్నట్లే తనకు రాయడానికి లైసెన్స్ ఉందని, రచన విషయంలో ఏటా తన అనుమతిని పునరుద్ధరించాలంటూ చమత్కరించేవాడినన్నారు.

"రాయడమనేది నాకు అలవాటుగా మారిపోయింది. బాల్యంలో అనేక పత్రికలు, మ్యాగజైన్లలో నా రచనలు ప్రచురితమయ్యాయి. రచనా వ్యాసంగం నన్నెప్పుడూ వదల్లేదు. 1978లో జెనీవాలోని ఐరాస హైకమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ లో చేరినప్పుడు.. సిబ్బందికి కఠినమైన ప్రవర్తనా నియమావళి ఉండేది. విధులు మినహా ఇతర కార్యకలాపాలకు అనుమతి తప్పనిసరి. కొంతమంది క్రికెట్ ఆడటం, సీతాకోక చిలుకలను పట్టుకోవడం, స్టాంపుల సేకరణ వంటివి చేయగలిగితే.. నేనెందుకు రాయకూడదు? అని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఐరాస సభ్యదేశాలను కించపరచకుండా ఉంటాననే షరతుపై వారు అనుమతి మంజూరు చేశారు" అని శశిథరూర్ తెలిపారు. శశిథరూర్ తన పదేళ్ల వయసులో ఓ భారతీయ ఆంగ్ల పత్రికలో మొదటి కథనాన్ని ప్రచురించారు. 2007 వరకు ఐరాసలో పనిచేసిన సమయంలో అనేక పుస్తకాలు రాశారు. ఐరాస కెరీర్ ప్రారంభంలో తాను రాసిన పుస్తకాల్లో ఓ అసాధారణ 'ఖండన'ను ప్రచురించేవారని శశిథరూర్ తెలిపారు. పుస్తక రచయిత ఐరాస సభ్యుడు అయినప్పటికీ పుస్తకంలోని పాత్రల ద్వారా వ్యక్తీకరించిన అభిప్రాయాలకు ఆయన అధికారిక హోదాతో ఎటువంటి సంబంధం లేదని పేర్కొనేవారట. ఫిక్షన్ ప్రపంచంలో ఈ విధమైన ఖండనను ప్రస్తావించిన ఏకైక నవలా రచయితను తానే కావొచ్చని చెప్పారు. కాగా, కేరళలోని తిరువనంతపురం నుంచి వరుసగా నాలుగోసారి విజయాన్ని అందుకున్నారు శశిథరూర్. ఈ స్థానంలో బీజేపీ తరఫున కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పోటీచేయగా ఫలితాల్లో ఇద్దరి మధ్యా గట్టి పోటీ కన్పించింది. చివరకు 16,077 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో థరూర్ గెలుపొందారు.

# అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్**



**విశ్వంభర, సూర్యాపేట:** వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం వీసీ కాన్ఫరెన్స్ హాల్లో నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లతాతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలకు స్పందించి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. పంచాయితీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ప్రజలు చేపల వేటకు వెళ్ళొద్దని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వ్యవసాయ పనులకు వెళ్ళొదన్నారు. వైద్యశాఖ సిబ్బంది తమ పరిధిలోని వారం రోజులలోగా ప్రసవాలకు సిద్ధంగా ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు కూడా కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా, డివిజన్ స్థాయిలో అత్యవసర సమయాలలో వినియోగించుకునే విధంగా అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉంచాలని అన్నారు. ప్రజలు ఏదేని అత్యవసర సేవలకు 6281492368 కంట్రోల్ రూము నంబర్ కు కాల్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో టామ్ టామ్ వేయించాలని కలెక్టర్ కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీఈవో అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, ఆర్డీవోలు సూర్యానారాయణ, శ్రీనివాసులు, డీఈఓ అశోక్, సీపీఓ నాయక్, డీటీడీఓ శంకర్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, డీసీఓ పద్మ, డీఎంహెచ్వో కోటచలం, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి

**- శంభీపూర్ క్రిష్ణ**

**విశ్వంభర, మేడ్చల్ జిల్లా :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, సంఘ సభ్యులు ఆయన కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాలలో తరచూ డ్రైనేజ్ ఓవర్ ఫ్లోతో దుర్వాసన, దోమల వృద్ధితో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని సమస్యలకు గల కారణాలు తెలుసుకొని శాశ్వత పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.



# భూపాలపల్లి అదనపు కలెక్టర్ పదవీ విరమణ




**విశ్వంభర, భూపాలపల్లి :** జవాబుదారీగా పని చేసే ప్రతి అధికారి ప్రజల మన్ననలు పొందుతారని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, అన్ని శాఖల అధికారులు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆత్మీయ పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిలుగా విచ్చేసి వెంకటేశ్వర్లు దంపతులను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విధుల పట్ల నిబద్ధత, అంకిత భావం కలిగిన వ్యక్తి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అని తెలిపారు. 1989 వ సంవత్సరంలో నాయబ్ తహసిల్దార్ గా ఉద్యోగ జీవితం ప్రారంభించిన వెంకటేశ్వర్లు తాను చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారని అన్నారు. పలు పదోన్నతులు పొందిన ఆయన చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారని అన్నారు. నేడు అదనపు కలెక్టర్ హోదాలో పదవీ విరమణ చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. జిల్లా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని అన్నారు. భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. జిల్లాకు సంవత్సర కాలం క్రితం బదిలీపై వచ్చిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు నాటి నుండి నేటి వరకు ఎంతో అంకిత భావంతో విధులు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ ఖాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలను ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకోవాలి

**పటాన్ చేరు డిఎస్పి రవీందర్ రెడ్డి, సిఐ ప్రవీణ్ రెడ్డి**

**విశ్వంభర, సంగారెడ్డి :** సెప్టెంబర్ 7 నుండి 15వ తారీకు వరకు జరిగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ర్ఆధ్యాత్మిక, సోదర భావంతో నిర్వహించాలని పటాన్ చేరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సి ఐ ప్రవీణ్ రెడ్డి వినాయక మండప నిర్వాహక సమావేశంలో వెల్లడించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ మండప నిర్వహకులు ప్రతి ఒక్కరూ తెలంగాణ పోలీసు వారి ప్రత్యేక ఆప్ లో వివరాలు నమోదు చేసుకోవాలని ఫైర్ డిపార్ట్మెంట్ ,జిహెచ్ఎంసి, మండప స్థలం యొక్క యజమాని నుండి ఎన్ఓసి తీసుకోవాలని, డీజే ఏర్పాటుకు అనుమతి లేదని అన్నారు. మండప నిర్వహకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు నిర్వహించాలని అన్నారు. అలా నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పటాన్ చేరు సీఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్ మాట్లాడుతూ మండపాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, మండపాల వద్ద వ్యర్థాలు వేయడానికి రెండు బుట్టలు ఇస్తామని నిమజ్జనానికి సాకి చెరువు, రాయసముద్రం చెరువు, బండ్లగూడ చెరువు వద్ద కృతిమ కొలనులను ఏర్పాటు చేస్తామని జిహెచ్ఎంసి సిబ్బంది మూడు షిఫ్ట్ ల వారీగా పనిచేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సి ఐ ప్రవీణ్ రెడ్డి ,ఎస్సై ఆసిఫ్ అలీ, జిహెచ్ఎంసి డి ఈ సురేష్,అగ్నిమాపకశాఖ సిఐ నాగేంద్ర హాజరయ్యారు.

**డిండి ఆయకట్టు పరిధిలోని పంటలకు**

# పూర్తి స్థాయిలో నీరు అందిస్తాం

**- ఎమ్మెల్యే బాలు నాయక్**




విశ్వంభర, డిండి : ప్రాజెక్టు కింద పంటలకు ప్రతి ఎకరానికి పంట కాలం పూర్తయ్యే వరకు సాగునీటిని అందిస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు. డిండి ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గిన విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కి నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కె ఎల్ ఐ ద్వారా డిండి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నింపి పంటలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నీటి పారుదల శాఖ మంత్రివర్యులకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

# బిసి నేతల ఆమరణ నిరాహారదీక్షకు మాజీ ఎమ్మెల్యే మద్దతు



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రభుత్వం బిసిల కుల గణన చేయడానికి వెంటనే నిర్ణయం తీసుకోవాలని , బిసి నేతల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి దీక్ష విరమించేలా ముందుకు రావాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్ లో దీక్ష కొనసాగిస్తున్న సంజయ్ కుమార్, బత్తుల సిద్దేశ్వర్ లను ఆయన కలిసి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా బీసీల కుల గణన వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బిసి ఆజాద్ యూత్ అద్యక్షులు జక్కని సంజయ్ కుమార్, బత్తుల సిద్దేశ్వర్ అమరణ నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు దీక్ష శిబిరం నుండి గాంధీ హాస్పటిల్ కు వారిని తరలించగా హాస్పిటల్ లోనే దీక్ష కొనసాగిస్తున్న వారిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్ కలిసి సంఘీబావం తెలిపారు.




**మాడుగుల పోలీస్ స్టేషన్ లో నూతన సిఐగా ఐ జగదీష్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐగా పని పనిచేశారు.**
**- విశ్వంభర, మాడ్గుల**

# విద్యార్థులు లేరంటూ 1,864 స్కూళ్లను మూసేసే కుట్ర

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల విద్యను తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను చదువుకు దూరం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు లేరన్న కారణంతో ఈ ఏడాది దాదాపు గా 1,864 స్కూళ్లను మూసేసే ప్రయత్నం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే ఇంతకన్నా ఆందోళన చెందాల్సిన అంశం మరొకటి లేదని కేటీఆర్ పేర్కొన్నారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఈ అంశంపై దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలపై దృష్టి సారించకపోతే బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకుండా స్కూళ్లను మూసి వేయాలని భావిస్తుండటం సిగ్గుచేటన్నారు. 2024లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య అంతకుముందు ఏడాదితో పోల్చుకుంటే దాదాపు 2.4 లక్షలు తగ్గింది. ఇది రాష్ట్ర విద్యారంగానికి ప్రమాద సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. 8 నెలల కాలంలోనే ప్రభుత్వ విద్యను కాంగ్రెస్ సర్కార్ అస్తవ్యస్థం చేసిందని మండిపడ్డారు. అసలు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో గుర్తించి ఆ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిద్రావస్థలో ఉండటంతోనే ఈ దుస్థితి దాపురించిందన్నారు.

**25 వేల టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి..**

ప్రధానంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల సంఖ్య లేకపోవటంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపుగా 25 వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెంటనే వాటిని భర్తీ చేయాల్సిన అవసరముందన్నారు. గత కొన్ని రోజులుగా గురుకుల స్కూళ్లలో జరుగుతున్న సంఘటనలు, వసతి గృహాల్లో విషాహారం, భద్రత లేని పరిస్థితులు, విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇది తెలంగాణ సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని కేటీఆర్ అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం ప్రభుత్వం బాధ్యత. ఆ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు రేవంత్ సర్కార్ కుంటి సాకులు వెతుక్కుంటుందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు.

**పేద విద్యార్థులు చదువుకోవడం రేవంత్‌కు ఇష్టం లేనట్టుంది..**

కేసీఆర్ వేసిన బాటను మరింత పటిష్టం చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సోయి లేకుండా ప్రవర్తిస్తోందన్నారు. స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు తగ్గి పోవటానికి కారణాలను అన్వేషించి వాటి నివారణపై దృష్టి పెట్టకుండా స్కూళ్లను మూసివేయటమేమిటనీ ప్రశ్నించారు. అంటే పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువు కోవటం రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను సృష్టించి తద్వారా విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేయాలని భావిస్తున్నారా అని కేటీఆర్ నిలదీశారు. అత్యంత ప్రాధాన్యమైన ఈ అంశాన్ని ఇంత నిర్లక్ష్యం చేస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు.

# విజయవాడలో భారీ వర్షం విరిగిపడిన కొండచరియలు

**చెరువులను తలపిస్తున్న ప్రధానరహదారులు..ఐదుగురి మృతి**

**విజయవాడ:** విజయవాడ నగరాన్ని వర్షాలు ముంచెత్తాయి. ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అనేక కూడళ్లలో నీరు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పండిట్ నెహ్రూ బస్టాండ్ ప్రాంగణం జలమయమైంది. లోతట్టు కాలనీల్లో వరద పారుతోంది. బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందారు. వన్‌టౌన్, గురునానక్ కాలనీ, చుట్టుగుంట, కృష్ణలంక, రామలింగేశ్వరనగర్‌లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు సహా బెంజ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. నిర్మలా కాన్వెంట్ ప్రాంతం చెరువును తలపిస్తోంది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని ఏపీఐఐసీ కాలనీ రోడ్డు నీట మునిగింది. మొగల్రాజపురంలో పాలి క్లినిక్ రోడ్డు జలమయమైంది. పాతబస్తీ పంజా సెంటర్‌లో మినార్ మసీదులోకి నీరు చేరింది. సింగ్ నగర్‌లో ఇళ్లు మనిగాయి. బుడమేరు మధ్య కట్ట ప్రాంతంలోని గృహాలను వరద ముంచెత్తింది. రైల్వే వర్క్ షాప్‌లోకి నీరు చేరింది. ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం జలమయమైంది. కొండపల్లి రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు ప్రవహిస్తోంది. విజయవాడలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందారు. వర్షపు నీటిలో నెహ్రూ బస్‌స్టేషన్ : పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టూటౌన్ కొత్తపేట పోలీస్ స్టేషన్ నీటిలో మునిగి పోయింది. రికార్డులు తడిచిపోయాయి. చాలాచోట్ల డ్రైన్లు పొంగి నీరు రోడ్లపైకి వస్తోంది. ప్రసాదంపాడు వద్ద జాతీయ రహదారి తటాకాన్ని తలపిస్తోంది. మోటార్లతో వర్షపు నీరు బయటకు : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని అనేక కాలనీల్లో నీరు నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అధికారులతో వెళ్లి నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. మోటార్లను తెప్పించి వర్షపు నీటిని బైటకు పంపే ఏర్పాట్లు చేశారు. స్థానికులకు ఆహారం అందించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు చేశారు. భారీ వర్షాల వల్ల నగరంలో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటిలో ఎక్కడికక్కడే కార్లు, బైకులు, బస్సులు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులపై వాహనాలు ముందుకు కదలక ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ద్విచక్రవాహనదారులు కిందకు దిగి బైక్‌ను తోసుకుంటూ వెళ్తున్నారు. మోకాళ్లలోతు నీటిలో ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అలెర్ట్‌గా ఉండి అవసరమైన సహాయక చర్యలు తక్షణం చేపట్టాలని ఆదేశించారు. మ్యాన్ హోల్స్, కరెంట్ తీగల దగ్గర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన సూచించారు. పొంగే వాగులు, వంకల దగ్గర అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు అధికారులతో ఎంపీ కేశినేని చిన్ని పరిస్థితి సమీక్షిస్తున్నారు. విజయవాడలో వర్షాల పరిస్థితిపై కంట్రోల్‌రూమ్‌లో కలెక్టర్ సృజన సమీక్షిస్తున్నారు. మొన్నటినుంచి కురుస్తున్న వర్షాలకు జరిగిన నష్టాల వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. కొండప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం తగ్గి రోడ్లపై నీరు తగ్గేంతవరకు బయటకు ప్రజలు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సంబంధాలకు ప్రతీక ముర్తుజా

**పదవీ విరమణ పొందిన సీపీఆర్వో ముర్తుజా ను సన్మానించిన ఉద్యోగులు**

**విశ్వంభర, హైదరాబాద్:** పదవీ విరమణ పొందిన జీహెచ్ఎంసీ సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా అలీ ని శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్ లో సిబ్బంది. మీడియా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ హోదాలో ఉన్న ముర్తుజా 2021 లో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్వోగా విధుల్లో చేరారని., నాటి నుంచి నేటి వరకు ప్రజాసంబంధాలకు ఆయన ప్రతీకగా విధులు నిర్వర్తించి జీహెచ్ఎంసీకి మంచి పేరు తీసుకొచ్చారని సిబ్బంది అభినందించింది. అంకిత భావంతో సేవలు అందించారని ప్రశంసించారు. . అన్ని వేళలా అందుబాటులో ఉండి అటు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు, మీడియా కు వారధిగా ఎప్పటికప్పుడు సమాచారం అందించడంలో తనకు తానే సాటిగా నిరూపించుకున్నారన్నారు. . గత మూడు సంవత్సరాల నుండి జీహెచ్ఎంసీ అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో, మీడియా ప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరి మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపిఆర్ఓ కార్యాలయ సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సిపిఆర్ఓ తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి ముమ్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ క్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పీ.ఆర్వో విజయలక్ష్మి, ఏ.ఎం.సి శారద, సూపరింటెండెంట్ లు శైలజ, పద్మ, సక్కుబాయి, సీనియర్ అసిస్టెంట్ లు మహమ్మ మోసిన్, రోహిత్, ఫోటోగ్రాఫర్ రమేష్, అబ్దుల్ సత్తార్, కంప్యూటర్ ఆపరేటర్లు ఆనంద్, శ్రీను, ఆఫీస్ సబార్డినేట్ లు అంజయ్య, మహేందర్, ఉమ, రమేష్, తౌఫిక్, అష్రఫ్, యాదగిరి, నరేందర్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, ఠాకూర్, డ్రైవర్ సల్లావుద్దిన్ పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన జీహెచ్ఎంసీ సీపీఆర్వో ముర్తుజాను సత్కరిస్తున్న సెక్షన్ సిబ్బంది

# ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావు కేసీఆర్?

**విశ్వంభర, రామగుండం:** ఏం అడగడానికి, ఏం చెప్పడానికి, ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తావు కేసీఆర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రశ్నించారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మీ 10 ఏళ్ల పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయకుండా గాలికి వదిలేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల వ్యవధిలోనే 18 వేల కోట్లు రైతుల కోసం బ్యాంకుల్లో జమ చేయడం తప్పు అని చెప్పడానికి వస్తావా కేసీఆర్ అని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని మీరు ఇవ్వలేకపోయారు.. మేం ప్రతి నియోజకవర్గానికి 3500 మందికి తగ్గకుండా రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇల్లు నిర్మించేందుకు ముందుకు పోతున్నాం.. ఇందిరమ్మ ఇల్లు ఇస్తే బాగుండదని చెప్పడానికి వస్తావా కేసీఆర్ అని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో ఉద్యోగాలు ఇవ్వలేకపోయాం.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నర నెలలోనే 60 వేల ఉద్యోగాలు ఇస్తుంది.. ఇది తప్పు మాలాగా ఉద్యోగాలు ఇవ్వద్దు అని చెప్పడానికి వస్తావా అన్నారు. దళితులకు మూడెకరాల భూమి అని చెప్పి ఎగనామం పెట్టిన కేసీఆర్ ఏం చెప్పడానికి ప్రజల్లోకి వస్తారని అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రాలేదు.. ఏ సామాజిక, భావ స్వేచ్ఛ కోసం, సంపద అందరికీ పంచాలని తెలంగాణ తెచ్చుకుంటే అవేవీ కాకుండా సంపద మొత్తం దోపిడికి గురైందన్నారు. కార్మికుల శ్రమను సైతం దోచుకున్న గత ప్రభుత్వాన్ని కూల్చాల్సిందేనని రామగుండం ప్రజలు పెద్ద ఎత్తున నా పాదయాత్రలో పాల్గొని అనేక సమస్యలు నా దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ మొత్తం సమావేశమై నిర్ణయించిందన్నారు.. ఆర్థిక ఇబ్బందులు ఉన్న నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ. సౌకర్యం కల్పించి ఆ మొత్తాన్ని ఇప్పటివరకు 2500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లించిందన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల వరకు పెంచామని తెలిపారు. ఏ ఒక్క నిమిషం ఆలస్యమైనా ఏ మూలనో రోగి ఇబ్బంది పడతాడని భావించి ప్రమాణ స్వీకారం చేసిన అరగంటలోపే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచి అమలు చేశామన్నారు. ప్రజా పాలన పేరిట సభలు పెట్టి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును మార్చి ఒకటి నుంచి అమలు చేస్తున్నామన్నారు.

500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తారో లేదో అని అంతా అనుమానపడ్డారు అర్హత కలిగిన అందరికీ 500 కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నాం.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పదేళ్ల పాలనలో విదేశాలకు వెళ్లి పెట్టుబడి తీసుకురాని కెసిఆర్ ఆయన కుమారుడు.. రాష్ట్ర సంపదను దోచుకుని విదేశాల్లో దాచుకున్నారని దుయ్యబట్టారు. మా సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబులు అమెరికా కొరియా దేశాల్లో పర్యటించి 36వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని తెలిపారు.

బొగ్గు భాయి బొంబాయి అని మోసపు మాటలు చెప్పి గత పాలకులు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. మేం మాత్రం దేశంలో ఎక్కడా లేనివిధంగా సింగరేణి కార్మికులకు కోటి రూపాయల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చాం. కాంటాక్ట్ కార్మికులకు 30 లక్షల బీమాను అమలు చేస్తున్నాం అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తూ మరోవైపు రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద 18 వేల కోట్లు జమ చేశామన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ పొందలేని రైతులందరికీ రుణమాఫీని వర్తింప చేస్తామన్నారు. వ్యవసాయ అధికారులు ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. కేసీఆర్ మీలాగా మేం ఇళ్లల్లో పడుకోలేదు ప్రతిరోజు ప్రజలను కలుస్తున్నామన్నారు.



**ప్రజలకు ఆస్తులు సృష్టించే వ్యవస్థలు ఏర్పరుస్తాం**

ఈ రాష్ట్ర ప్రజలకు ఆస్తులు సృష్టించే వ్యవస్థలు ఏర్పరిచి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. రామగుండం ప్రజల భావోద్వేగాలతో కూడుకున్న థర్మల్ పవర్ ప్లాంట్ ను 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. జెన్కో ,సింగరేణి సంయుక్తంగా రామగుండంలో పవర్ ప్రాజెక్టు నిర్మించి ఉద్యోగాలు పోకుండా నిలబెట్టేందుకు ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తుందన్నారు .రైతులు ,యువత, సాగునీటి ప్రాజెక్టుల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో పట్టు ఉంది కదా అని అభాసుపాలు చేసేందుకు ప్రయత్నం చేస్తే ప్రజలు ఏమాత్రం ఉపేక్షించారన్నారు . మీ కన్నా ఎక్కువ కరెంటు ఉత్పత్తి చేస్తాం. రేపు పాటు కూడా కరెంటు కోతలు లేకుండా ఉద్యోగులు శ్రమిస్తున్నారని తెలిపారు. పిక్ డిమాండ్ 15,600 మెగావాట్లను అందుకున్నామన్నారు. 2032 రెండు కల్లా రాష్ట్ర విద్యుత్తు అవసరాలు 27059 మెగావాట్లు అంచనా వేసి ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. థర్మల్ ప్రాజెక్టులు నిర్మిస్తాం, సోలార్, ఫ్లోటింగ్ అన్ని రకాల వనరులు వినియోగించి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఎదగడమే కాదు ఇతర రాష్ట్రాలకు విద్యుత్తును అమ్మి లాభాలు సాధిస్తాం. ఇక్కడ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించి యువతకు ఉపాధిని కల్పిస్తాం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పీఎం కుసుమ ప్రాజెక్టు కింద 4000 మెగావాట్ల సోలార్ విద్యుత్ను ఉత్పత్తి చేసేందుకు మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తాం అన్నారు. ప్రతి మహిళను మహారాణిగా ఈ ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. ఏటా 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందిస్తామన్నారు. మహిళల పక్షాన ఆ వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్ ప్రారంభిస్తాం.

ప్రతి శాసనసభ నియోజకవర్గంలో రాజీవ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. హైదరాబాద్ కు వెళ్లి పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకోలేని వారికోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో శిక్షణ కేంద్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. దేశంలోనే నిష్ణాతులైన లెక్చరర్లతో ఉచితంగా పోటీ పరీక్షలకు ఆన్లైన్లో శిక్షణ అన్నారు. నాలుగు నుంచి ఐదు లక్షల మంది నిరుపేద విద్యార్థులు రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్నారని... వారికి గత ప్రభుత్వం మూడు కోట్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి 5000 కోట్లు కేటాయించింది అన్నారు. రాష్ట్రంలో ఫ్యూడల్ గవర్నమెంట్ వద్దు పీపుల్స్ గవర్నమెంట్ ఉండాలి అని రాష్ట్ర ప్రజలందరూ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ట్రాన్స్‌ఫార్మర్ , సబ్‌స్టేషన్ కరెంటు పోల్స్ అవసరం ఉన్న స్థానిక ప్రజా ప్రతినిధులను సంప్రదిస్తే వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు..

# పేరేమో ఉత్తమ్.. మాటేమో మూసీ ప్రవాహం

**కేసీఆర్‌పై వ్యాఖ్యల పట్ల హరీశ్‌రావు మండిపాటు**

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను డెకాయిట్ అంటూ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రిని అలా సంబోధించడం, మంత్రి ఉత్తమ్ దిగజారుడు మనస్తత్వానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టిన కేసీఆర్‌ను డెకాయిట్ అని అనడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నోరెలా వచ్చిందని మాజీమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇంతకంటే దారుణం, మహాపాపం మరొకటి ఉండదని ఆక్షేపించారు. బూతులు మాట్లాడడంలో, అన్ పార్లమెంటరీ భాష ఉపయోగించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కంటే అతనేమీ వెనకబడలేదని నిరూపించాలనుకున్నారా? అని ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ప్రశ్నించారు.

**డెకాయిటీ చేసింది ఎవరు:** పేరేమో ఉత్తమ్ కుమార్ – మాట తీరేమో మూసీ ప్రవాహమని ఎద్దేవా చేలఆరు. రేవంత్‌రెడ్డి నోటితో పాటు ఉత్తమ్ నోటిని కూడా ప్రక్షాళన చేయాల్సి ఉందని ఆయన మండిపడ్డారు. జలయజ్ఞంలో ఈపీసీ పద్ధతిని ప్రవేశపెట్టి ఇష్టం వచ్చినట్లు ప్రాజెక్టుల అంచనా విలువలను పెంచేసి, ఏజెన్సీలకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు, నిబంధనలకు విరుద్ధంగా సర్వే, డిజైన్ అడ్వాన్స్‌లను 0.5 శాతం నుంచి 3.5 శాతానికి పెంచుకొని రాష్ట్రాన్ని డెకాయిటీ చేసింది ఎవరని అడిగారు.

**తట్టమట్టి ఎత్తలేదు :** వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నదెవరన్నది మీరు కాదా? అని ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.17 వేల కోట్ల నుంచి తట్ట మట్టి ఎత్తకుండానే 40 వేల కోట్లకు పెంచుకున్న సంగతిని మరచిపోయారా అని నిలదీశారు. కాంగ్రెస్ డెకాయటీ గురించి ఇప్పటికే ఎన్నోసార్లు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలో వ్యవసాయ రంగం అభివృద్ధి, ఇతర మానవాభివృద్ధి సూచికల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌ది అని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ వదిలి పెట్టిపోయిన అనేక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాల కల్పనలో అద్భుతమైన ప్రగతి సాధించినందు వల్లే వృద్ధి రేటు సాధ్యమైందని పేర్కొన్నారు.



# మహేష్ కుమార్ గౌడ్‌కే పీసీసీ పీఠం?

(మొదటి పేజీ తరువాయి)

అయినట్లు సమాచారం. మరో సీనియర్ నేత మధుయాస్కీ గౌడ్ పేరు కూడా బలంగా వినిపిస్తున్నప్పటికీ చివరికి మహేష్‌కుమార్ పేరువైపే అధిష్ఠానం మొగ్గు చూపినట్లు సమాచారం. ఇక అధికారిక ప్రకటన మాత్రమే మిగిలి ఉందని దిల్లీ వర్గాలు చెబుతున్నాయి.మొత్తమ్మీద బీసీ నేతకే పీసీసీ పీఠం ఖాయమైంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఆదివారం ప్రకటన ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ కాంగ్రెస్ లోకి వచ్చిన ప్పటి నుంచి మొదలుకునిన పీసీసీ అధ్యక్షుడుగా..సీఎం అయిన సమయంలోనూ మహేష్ కుమార్ గౌడ్ ఆయనకు పూర్తి మద్దతుగా నిలిచారు. ఏఐసీసీ నిర్ణయం తాన ఛాయిస్ చెప్పినా...పార్టీ నాయకత్వం పీసీసీ అధ్యక్షుడి నియామకంలో తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని రేవంత్ స్పష్టం చేశారు. ఇక శ్రావణ మాసం పూర్తికానుండడం, మంచి రోజులు అయిపోతుండడంతో.. టీపీసీసీ అధ్యక్షుడి పేరును త్వరగా ప్రకటించాలని పలువరు అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏ క్షణమైనా కొత్త పీసీసీ చీఫ్ నియమాకానికి సంబంధించి ప్రకటన వెలువడే అవకాశం ఉందని హస్తం వర్గాలు చెబుతున్నాయి.కాగా పశ్చిమ బెంగాల్ పీసీసీ చీఫ్‌గా దీపాదాస్ మున్షీ, కేరళ పీసీసీ అధ్యక్షుడుగా కేసీ వేణుగోపాల్ పేరు ఖరారైంది. ప్రస్తుతం కేసీ వేణుగోపాల్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా అశోక్ గెహ్లాట్ బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ స్థానంలో ఛత్తీస్ గఢ్ మాజీ సీఎం భూపేష్ భగేల్ ఉండనున్నారు.

**ఎవరీ మహేష్ కుమార్ గౌడ్ ?**

బొమ్మ మహేష్ కుమార్.. గౌడ సామాజిక వర్గానికి చెందిన నేత. 1966 ఫిబ్రవరి 24న నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం, రహత్‌నగర్‌లో జన్మించారు. గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఆయన.. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1986లో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న వయస్సులోనే పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2013 నుంచి 2014 వరకు గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పని చేశారు. ఆ తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం పీసీసీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2018లో నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశించినా ఆ ఎన్నికల్లో ఆ స్థానాన్ని అధిష్ఠానం మైనార్టీలకు కేటాయించడంతో పోటీ నుంచి తప్పుకున్నారు. అయితే.. రాష్ట్ర ఎన్నికల కమిటీలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ కన్వీనర్ పదవిని హైకమాండ్ కట్టబెట్టింది. 2021 జూన్- 26న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, 2022 డిసెంబర్- 10న కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కార్యనిర్వాహక కమిటీలోప్రత్యేక ఆహ్వానితుడిగా, 2023 జూన్- 20న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎన్నికల కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు 2023లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయాలనీ భావించిన మహేష్.. ఆ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీని పార్టీ అభ్యర్థిగా బరిలోకి దింపడంతో పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో.. ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024 జనవరి 29న తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. చూశారుగా.. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారు. ఇన్ని రోజులకు ఆయన కష్టానికి తగిన ఫలితం లభించబోతోందని కార్యకర్తలు, అభిమానులు, అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అక్కరకొచ్చేలా..ఆకాంక్షలు తీర్చేలా..

**విశ్వంభర, హైదరాబాద్:** కొత్త రెవెన్యూ చట్టం ముసాయిదాపై ప్రజల నుంచిఅభిప్రాయ సేకరణ పూర్తి అయిన నేపథ్యంలో చట్ట రూపకల్పనపై దృష్టి సారించాలని, కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురావడానికి అవసరమైన కసరత్తును త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చిన అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అన్నింటినీ ఒక దగ్గర పొందుపరచి పరిశీలించాలని, వచ్చిన వాటిలో ఈ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి ఏది అవసరమో ఆ అంశాలను ఈ కొత్త చట్టంలో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి, పరిస్థితులకు తగినట్టుగా భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురాబోతున్నామని వెల్లడించారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తే, గత పాలకుల తొందరపాటు నిర్ణయాలతో అది నెరవేరకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నం అయ్యాయని విమర్శించారు. 2020 రెవెన్యూ చట్టం లోపభూయిష్టంగా ఉండడంతో రైతులు, భూ యజమానులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ధరణి పోర్టల్ వల్ల భూ సమస్యలు మరింత పెరిగాయని, దీంతో రైతులు, భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సివచ్చింది. తప్పుల తడకల ధరణి వల్ల రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మంది రైతులు ధరణి బాధితులుగా మారారు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేలా మేధావులు, నిపుణులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, సామాన్య ప్రజలనుంచి కూడా అభిప్రాయాలను స్వీకరించడం జరిగింది. ముసాయిదాపై శాసన సభలో చర్చించి అదే రోజు హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కార్యాలయంలో పబ్లిక్ డొమైన్ లో పెట్టడం జరిగింది. అలాగే జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో వర్క్ షాప్ లు కూడా నిర్వహించడం జరిగింది. జిల్లా స్థాయిలో నిర్వహించిన వర్క్ షాప్ లలో వచ్చిన సూచనలను ఒక నివేదిక రూపంలో కలెక్టర్లు వెంటనే భూపరిపాలన కార్యాలయానికి పంపించాలి " అని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత స్థాయిలో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద ఎత్తున సూచనలు వచ్చాయని, లిఖిత పూర్వకంగా, అలాగే ఈమెయిల్ ద్వారా కూడా సూచనలు వచ్చాయని, సామాన్యులు సైతం పలు సూచనలు చేశారని తెలిపారు.అమలు చేసేవారికి అవగాహన ఉండేలా రైతులకు, సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవినీతి రహితంగా చట్టాన్ని తీసుకురాబోతున్నామన్నారు. గత ప్రభుత్వంలో అత్యంత రహస్యంగా ఉన్న ధరణిని తమప్రభుత్వం ఒక పబ్లిక్ డాక్యుమెంట్ గా అందరికీ అందుబాటులో ఉంచబోతుందని ప్రకటించారు.

# రుబీనా గురి కుదిరింది

## భారత్ ఖాతాలో మరో పతకం



**విశ్వంభర, క్రిడావిభాగం:** పారిస్ పారాలింపిక్స్ 2024 మూడో రోజున షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ భారత్‌కు తొలి పతకాన్ని అందించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ SH1 ఈవెంట్‌లో రుబీనా ఫ్రాన్సిస్ ఫైనల్లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇదే రుబీనాకు పారాలింపిక్ లో తొలి పతకం. అదే సమయంలో పారిస్ పారాలింపిక్స్ 2024లో భారత్ కు ఇప్పటి వరకూ మొత్తం 5 పతకాలు దక్కాయి. ఈ పతకాల్లో షూటింగ్‌లోనే 4 పతకాలు వచ్చాయి. రుబీనా 211.1 పాయింట్స్ సాధించి ఈ పతకాన్ని గెలుచుకుంది.

**తొలి మహిళా పిస్టల్ పారా షూటర్‌గా..**

ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ 2018 ఫ్రాన్స్ ప్రపంచ కప్ సమయంలో వచ్చింది. ఇక్కడ పారాలింపిక్ కోటాను సాధించడం ప్రాముఖ్యతను రుబీనా గ్రహించింది. ఇది ఆమె శిక్షణను మరింత తీవ్రతరం చేయడానికి ఆమెను ప్రేరేపించింది. ఆ తరువాత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించింది. ఈ కాలంలో ప్రపంచ రికార్డులను కూడా సృష్టించింది. లిమా 2021 ప్రపంచ కప్‌లో ఆమె అతిపెద్ద విజయం సాధించింది. అక్కడ ఆమె P2 విభాగంలో పారాలింపిక్ కోటాను పొందింది. తద్వారా 2021 టోక్యో పారాలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. భారతదేశపు తొలి మహిళా పిస్టల్ పారా షూటర్‌గా రుబీనా కథ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

**కాంస్యం లక్ష్యంగా పెట్టుకున్న రుబీనా ఫ్రాన్సిస్**

ఫైనల్ స్టేజ్ 1 తర్వాత రుబీనా ఫ్రాన్సిస్ మూడో స్థానంలో నిలిచింది. ఈ దశలో ఆమె 10 షాట్‌లలో మొత్తం 97.6 (10.7, 10.3, 10.3, 9.7, 9.0, 8.4, 10.0, 9.8, 9.6, 9.8) స్కోర్ చేసింది. రుబీనా ఫ్రాన్సిస్ తన అద్భుతమైన ఆటను స్టేజ్ 2లో కొనసాగించింది. రుబీనా ఫ్రాన్సిస్‌తో పాటు భారత్‌కు కూడా ఈ పతకం ఎంతో చరిత్రాత్మకం. నిజానికి పారాలింపిక్స్‌లో పిస్టల్ షూటింగ్‌లో పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించింది.

**మెకానిక్ కూతురు చేసిన పెద్ద ఫీట్**

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన పారా పిస్టల్ షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ ఇటీవలి కాలంలో భారత్ తరఫున ఆకట్టుకునే ప్రదర్శన కనబరుస్తోంది. ఆమె ఇంతకు ముందు కూడా చాలా ఈవెంట్‌లలో భారతదేశానికి కీర్తిని తెచ్చిపెట్టింది, రుబీనా ఫ్రాన్సిస్ వరల్డ్ షూటింగ్ పారా స్పోర్ట్స్ వరల్డ్ కప్- 2023లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది. ఆమె పారాచూటింగ్ ప్రపంచ కప్‌లో P-6 ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని కూడా గెలుచుకుంది. రుబీనా తల్లి సునీతా ఫ్రాన్సిస్ జబల్‌పూర్‌లోని ప్రసూతి గృహంలో నర్సుగా విధులను నిర్వహిస్తుండగా ఆమె తండ్రి సైమన్ మోటార్ మెకానిక్‌గా పనిచేసున్నారు.

**పారిస్ పారాలింపిక్స్ 2024లో పతకాలు సాధించిన భారతీయులు**

పారిస్ పారాలింపిక్స్ 2024లో భారత్ ఖాతాని షూటర్ అవనీ లేఖరా తెరిచారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్ 1లో అవనీ బంగారు పతకాన్ని గెలుచుకుంది. కాగా ఈ ఈవెంట్‌లో మోనా అగర్వాల్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీని తర్వాత ప్రీతీ పాల్ భారత్‌కు మూడో పతకాన్ని అందించింది. 100 మీటర్ల టీ35 విభాగంలో ప్రీతీ పాల్ దేశానికి కాంస్య పతకాన్ని అందించింది. ట్రాక్ ఈవెంట్‌లో పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణి కూడా ప్రీతినే. దీని తర్వాత మనీష్ నర్వాల్ నాలుగో పతకాన్ని సాధించాడు. మనీష్ నర్వాల్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్ 1లో రజత పతకం సాధించాడు.

## ఆన్‌లైన్ క్రికెట్ కోచ్..
# పాక్ కొత్త ప్రయోగం



**విశ్వంభర, క్రిడావిభాగం :** పాక్ టీమ్ వరుస అపజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. 2024 టీ20 వరల్డ్ కప్‌లో పేలవ ప్రదర్శనతోపాటు తాగాజా బంగ్లాదేశ్ తో జరుగుతున్న ఫస్ట్ టెస్ట్ లో 10 వికెట్ల తేడాతో ఓడిపోవడంపై మాజీలతోపాటు బోర్డ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్లేయర్ల ఎంపిక సరిగా లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పాక్ క్రికెట్ బోర్డ్ ఆటగాళ్ల సెలక్షన్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టెక్నాలజీ సాయం తీసుకోవడం క్రీడాలోకం లో చర్చ నీయాంశమైంది. ఈ మేరకు పీసీబీ చీఫ్ మోహ్‌సిన్ నఖ్వీ మీడియాతో మాట్లాడుతూ.. పాక్ జట్టును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని అంగీకరిస్తున్నట్లు తెలిపారు. కానీ ప్రపంచకప్ టోర్నీకి ఈ పని చేయలేకపోయామని, కొత్తవారిని జట్టులోకి తీసుకోవడానికి సరైన డేటా లేదన్నారు. అయితే ఈ సమస్యను పరిష్కరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతేకాదు త్వరలో జరిగే మెగా టోర్నీ కోసం ఏఐ సాయంతో ఆటగాళ్ల సెలక్షన్ కూడా జరిగిపోయిందని స్పష్టం చేశారు. తమ దగ్గర యువ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించే ప్లానింగ్ లేదని నఖ్వీ వివరించారు. ఇక్కడి వ్యవస్థ సరిగా లేదన్నారు. త్వరలో జరిగే ఛాంపియన్స్ కప్ కోసం కొంతమంది యువకులను గుర్తించి, టాలెంటెడ్ ప్లేయర్ల డేటాను సేకరిస్తామన్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం 150 మంది ప్లేయర్లను సెలెక్ట్ చేసి ఇందులో ఏఐ పాత్ర 80 శాతం, సెలక్షన్ కమిటీ పాత్ర 20 శాతం ఉందన్నారు. సరిగా ఆడని ప్లేయర్లను వెంటనే రీప్లేస్ చేస్తామని నఖ్వీ వివరించారు.



# భారత క్రికెట్ జట్టులోకి రాహుల్ ద్రావిడ్ కొడుకు

**విశ్వంభర, క్రిడావిభాగం :** టీమిండియా మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్ భారత అండర్-19 జట్టుకు ఎంపికయ్యాడు. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరగనున్న టెస్టు, వన్డే సిరీస్‌లకు జూనియర్ ద్రవిడ్ సెలక్ట్ అయ్యాడు. సెప్టెంబర్ 21 నుంచి ఆస్ట్రేలియా అండర్-19 టీమ్‌తో భారత్ యువ జట్టు మూడు వన్డేలు, రెండు.. నాలుగు రోజుల టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్‌లకు భారత యువ జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. పుదుచ్చేరి వేదికగా వన్డే సిరీస్, చెన్నై వేదికగా మల్టీ డే మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా, వన్డే సిరీస్‌కు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహ్మద్ అమాన్ కెప్టెన్‌గా, గుజరాత్‌కు చెందిన రుద్ర పటేల్ వైస్‌కెప్టెన్‌గా ఎంపికయ్యారు. రెడ్ బాల్ క్రికెట్‌కు మధ్యప్రదేశ్‌కు చెందిన సోహమ్ పట్వర్ధన్ సారథిగా, పంజాబ్‌కు చెందిన విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా, సమిత్ ద్రవిడ్ మిడిలార్డర్ బ్యాటర్. ఇటీవల సీనియర్ మెన్స్ టీ20 టోర్నమెంట్ అయిన మహారాజ టీ20 ట్రోఫీలో పాల్గొన్నాడు. మైసూర్ వారియర్స్ తరఫున బరిలోకి దిగాడు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో 114 స్ట్రైక్‌రేటుతో 82 పరుగులు చేశాడు.

**ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపికైన భారత అండర్-19 జట్టు**

మహ్మద్ అమాన్ (కెప్టెన్), రుద్ర పటేల్ (వైస్ కెప్టెన్), సాహిల్ పరాఖ్, కార్తికేయ, కిరణ్ చోర్మలే , అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వాన్ష్ సింగ్ (వికెట్ కీపర్), సమిత్ ద్రవిడ్, యుధాజిత్ గుహా, సమర్థ్ , నిఖిల్ కుమార్ , చేతన్ శర్మ , హార్దిక్ రాజ్ , రోహిత్ రాజావత్ , మహ్మద్ ఈనాన్.

## 19 సిక్సర్లు, 8 ఫోర్లు..
# గేల్ రికార్డును బద్దలు కొట్టిన ఆయుష్ బదోని

**విశ్వంభర, క్రిడావిభాగం :** ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ ఆటగాళ్లు ఆయుష్ బదోనీ, ప్రియాన్ష్ ఆర్య అదరగొట్టారు. ఒక ఇన్నింగ్స్‌లో 19 సిక్స్‌లు కొట్టి బదోనీ... వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ అత్యధిక సిక్సుల రికార్డును బద్దలు కొట్టాడు. క్రిస్ గేల్ 2017 బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో 18 సిక్సులతో 146 పరుగులు (నాటౌట్) చేశాడు. ఇప్పుడు బదోనీ 19 సిక్సర్లతో గేల్ రికార్డును అధిగమించాడు. ఇక, ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లతో ప్రియాన్ష్ రికార్డులు సృష్టించారు. వీరిద్దరు సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ తరఫున ఆడుతున్నారు. నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ పలు రికార్డులు నమోదు చేసింది. ఆయుష్ బదోనీ-ప్రియాన్ష్ ఆర్య 286 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. టీ20 క్రికెట్ చరిత్రలో ఇది అత్యుత్తమ భాగస్వామ్యం. వీరిద్దరు 29 సిక్స్‌లు కొట్టారు. మొత్తంగా సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ ఈ మ్యాచ్‌లో 31 సిక్స్‌లు కొట్టింది. టీ20 క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ఒక జట్టు కొట్టిన అత్యధిక సిక్సులు ఇవే. ఆయుష్ బదోనీ ఒక్కడే 19 సిక్స్‌లు కొట్టి క్రిస్ గేల్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. మనన్ భరద్వాజ్ వేసిన 12వ ఓవర్‌లో ప్రియాన్ష్ ఆర్య ఆరు సిక్స్‌లు కొట్టాడు. ప్రియాన్ష్ ఆర్య 50 బంతుల్లో 10 సిక్స్‌లతో 120 పరుగులు చేయగా, బదోనీ 55 బంతుల్లో 19 సిక్సర్లతో 165 పరుగులు చేశాడు. ఇద్దరూ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారు. దీంతో సూపర్





స్టార్స్ 5 వికెట్లు కోల్పోయి 308 పరుగులు చేసింది. టీ20 చరిత్రలో ఇప్పటి వరకు నమోదైన రెండో అత్యధిక స్కోర్ ఇది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన బదోనీ క్రికెట్ అభిమానులకు సుపరిచితుడు. మెగా వేలానికి ముందు అతను అద్భుత ప్రదర్శన చేశాడు. అతను ఐపీఎల్‌లో 42 మ్యాచ్‌లు ఆడాడు. 134 స్ట్రైక్ రేటుతో 634 పరుగులు చేశాడు.

**రికార్డులు ఇవే...**

- ప్రియాన్ష్ ఆర్య, ఆయుష్ బదోనీ 286 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.
- ఒక ఇన్నింగ్స్‌లో 19 సిక్స్‌లు కొట్టి క్రిస్ గేల్ (18 సిక్సులు) పేరిట ఉన్న రికార్డును ఆయుష్ బదోనీ అధిగమించాడు.
- ఒక ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టిన క్రికెటర్ల సరసన ప్రియాన్ష్ ఆర్య చేరాడు. యువరాజ్ సింగ్, కీరన్ పొలార్డ్, నికోలస్ పూరన్‌లు ఈ ఫీట్‌ను సాధించారు.
- గతంలో ఐపీఎల్‌లో నేపాల్ 26 సిక్స్‌లు కొట్టింది. ఇప్పుడు ఒక ఇన్నింగ్స్‌లో 31 సిక్స్‌లు కొట్టి సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ నేపాల్‌ను వెనక్కి నెట్టింది.
- సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 308 పరుగులు చేసింది. టీ20ల్లో ఇది రెండో అత్యధికం. 2023లో మంగోలియాపై నేపాల్ 3 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసింది.




# కోహ్లి కంటే అతనే అత్యుత్తమం

## ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్

**విశ్వంభర, క్రిడావిభాగం :** భారత క్రికెటర్లపై అక్కసు వెల్లగక్కడంలో పాకిస్థాన్ మాజీ క్రికెటర్లతో పాటు ఇంగ్లండ్ ప్లేయర్లు ఎప్పుడూ ముందుంటారు. టీమిండియా ప్లేయర్ల కంటే తమ ఆటగాళ్లే గొప్ప అంటూ తరుచూ వ్యాఖ్యలు చేస్తుంటారు. అయితే అవన్నీ భారత్‌తో సిరీస్ లేదా మ్యాచ్‌లు జరిగే సమయంలో అంటుంటారు. కానీ ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ ఈ సారి భిన్నంగా టీమిండియా అభిమానులను హర్ట్ చేసేలా ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లి కంటే జో రూట్ అత్యుత్తమం అంటూ అర్థం వచ్చేలా మైకేల్ వాన్ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. గణాంకాలు వివరిస్తూ పోస్ట్ పెట్టాడు. ''టెస్టు ఫార్మాట్‌లో కోహ్లి 191 ఇన్నింగ్స్‌ల్లో 49.16 సగటుతో 8848 పరుగులు చేశాడు. 29 సెంచరీలు, 30 హాఫ్ సెంచరీలు బాదాడు. అత్యధిక స్కోరు 254. ఇక జో రూట్ 264 ఇన్నింగ్స్‌ల్లో 50.72 సగటుతో 12274 పరుగులు చేశాడు. 33 సెంచరీలు, 64 హాఫ్ సెంచరీలు సాధించాడు. అత్యధిక స్కోరు 254'' ఈ గణాంకాలను మైకేల్ వాన్ ఓ పేపర్ మీద రాసి పోస్ట చేసి.. మార్నింగ్ ఇండియా అంటూ క్యాప్షన్ రాసుకొచ్చాడు.

# మోటోరోలా రాజ్ర్ 50 లాంచ్ కు డేట్ ఫిక్స్



**విశ్వంభర, బిజినెస్ :** మోటరోలా ఒక నెల క్రితం Razr 50 అల్ట్రాను అధికారికంగా ప్రకటించింది. ఇప్పుడు ఇది భారతదేశంలో విడుదల చేయడానికి ఆ కంపెనీ ఏర్పాట్లు చేసింది. సెప్టెంబర్ 9న LTPO AMOLED మోటో Razr 50 భారతదేశంలో విడుదల అవుతుందని స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ ప్రకటించింది. ఈ స్మార్ట్‌ఫోన్ ఇప్పటికే అమెజాన్‌లో కూడా విక్రయానికి సిద్ధంగా ఉంది. Razr 50లో అత్యంత ప్రకాశవంతమైన డిస్‌ప్లేలలో ఒకటి ఉంటుందని వినియోగదారులు భావిస్తున్నారు. LTPO AMOLED మోటో Razr 50 సాంప్రదాయ ఫ్లిప్ ఫోన్. 6.9-అంగుళాల సైజ్ ఉంటుంది. HDR10+, దాదాపు 3000 నిట్స్ గరిష్ట ప్రకాశాన్ని సపోర్ట్ చేసే సామర్థ్యం దీనికి ఉంది. ఈ స్క్రీన్ ప్రకాశవంతంగా వెలిగే ప్రదేశాలలో కూడా మీడియాను చూడటానికి సరైనది. 120 Hz రిఫ్రెష్ రేట్ వద్ద పరివర్తనలు, స్క్రోలింగ్ సజావుగా ఉండవచ్చు. అంగుళానికి 413 పిక్సెల్‌ల సాంద్రత,1080 x 2640 పిక్సెల్‌ల రిజల్యూషన్ ఉన్న దృశ్యాలు ప్రకాశవంతంగా, స్పష్టంగా కనిపిస్తాయి. కవర్ డిస్‌ప్లేలో 90 Hz రిఫ్రెష్ రేట్, 1700 నిట్స్ గరిష్ట ప్రకాశంతో 3.6-అంగుళాల AMOLED ప్యానెల్ ఉంటుంది. గొరిల్లా గ్లాస్ విక్టస్ కూడా కవర్ డిస్‌ప్లేను రక్షించడానికి ఉపయోగించారు. స్టెయిన్‌లెస్ స్టీల్ హింగ్‌తో కూడిన అల్యూమినియం ఫ్రేమ్, సిలికాన్ పాలిమర్ బ్యాక్, మడతపెట్టినప్పుడు గ్లాస్ ఫ్రంట్ విప్పినప్పుడు ప్లాస్టిక్ ఫ్రంట్ తో ఈ ఫోన్ చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. అదనంగా, దీనికి IPX8 వాటర్ రెసిస్టెన్స్ సర్టిఫికేషన్ కూడా ఉందట. ఇది 30 నిమిషాల పాటు 1.5 మీటర్ల నీటిలో మునిగిపోకుండా ఉంటుందట. ఫోన్ విప్పినప్పుడు Razr 50 బరువు దాదాపు 188.4 గ్రాములు, దాదాపు 7.3 మిమీ మందంతో సన్నని ప్రొఫైల్‌ను కలిగి ఉంటుంది.

వెనుక భాగంలో డ్యూయల్-కెమెరా కాన్ఫిగరేషన్ ఉంటుందని తెలుస్తోంది. బహుశా OISతో 50MP వైడ్ లెన్స్, 13MP అల్ట్రావైడ్ లెన్స్ ఇందులో ఉంటాయట. ముందు, వెనుక కెమెరాలను ఉపయోగించి సెకనుకు 30 ఫ్రేమ్‌ల వద్ద 4K వీడియో రికార్డింగ్ చేయవచ్చు. 32MP ఫ్రంట్ కెమెరా సెల్ఫీలు అద్భుతంగా తీస్తుంది.

ఈ స్మార్ట్ ఫోన్ ఆండ్రాయిడ్ 14 వర్షన్ తో పని చేస్తుంది. Mediatek Dimensity 7300X ప్రాసెసర్, 8GB RAM, 256GB మెమొరీ కెపాసిటీ దీని ప్రత్యేకతలు. 12GB RAMతో 512GB అనేవి నిల్వ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. 4200 mAh బ్యాటరీ కెపాసిటీతో 30W వైర్డు, 15W వైర్‌లెస్ ఛార్జింగ్ సౌకర్యం కల్పించారు. Wi-Fi 6e, బ్లూటూత్ 5.4, NFC కనెక్టివిటీ సామర్థ్యాలు కూడా ఉన్నాయట. కోలా గ్రే, బీచ్ సాండ్, స్ప్రిట్జ్ ఆరెంజ్ రంగుల్లో ఈ ఫోన్ లభిస్తుందని సమాచారం.

# బీఎస్ఎన్ఎల్ బెస్ట్ ఆఫర్




**విశ్వంభర, బిజినెస్ :** బీఎస్ఎన్ఎల్ ప్రైవేట్ టెలికాం కంపెనీలకు టెన్షన్ పుట్టేలా చేస్తోంది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఇటీవల అనేక రీఛార్జ్ పథకాలను ప్రవేశపెట్టింది. ఇవి ప్రైవేట్ కంపెనీల పథకాల కంటే ఎక్కువ. వినియోగదారులు తక్కువ ధరలో అపరిమిత కాలింగ్, డేటాతో సహా అనేక ప్రయోజనాలను పొందుతారు. అప్పుడు కంపెనీ అటువంటి రీఛార్జ్ ప్లాన్‌ను అందించబోతోంది. దీని ధర కేవలం 200 రూపాయలు మాత్రమే. కంపెనీ తన వినియోగదారులకు చౌక ధరలకు లాంగ్ వాలిడిటీ ప్లాన్‌లను అందిస్తోంది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ రూ. 200లోపు అలాంటి రెండు ప్లాన్‌లను కలిగి ఉంది. ఇది వినియోగదారులకు అపరిమిత కాలింగ్, డేటా, సుదీర్ఘ చెల్లుబాటును అందిస్తుంది. ఈ ప్లాన్‌లలో ఒకటి వినియోగదారులకు గరిష్టంగా 70 రోజుల వరకు చెల్లుబాటును అందిస్తుంది.

బీఎస్ఎన్ఎల్ రూ. 199 ప్లాన్: ఈ బీఎస్ఎన్ఎల్ రీఛార్జ్ ప్లాన్ ధర రూ. 199. ఈ రీఛార్జ్ ప్లాన్‌లో వినియోగదారులు రోజుకు 2GB డేటా, 100 ఉచిత SMS ల ప్రయోజనాన్ని పొందుతారు. ఈ ప్లాన్‌లో, వినియోగదారులు 30 రోజుల చెల్లుబాటును పొందుతారు. అంటే వినియోగదారులు మొత్తం 60GB డేటాను పొందుతారు. ఇది కాకుండా ఈ ప్లాన్ దేశవ్యాప్తంగా ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాలింగ్ ప్రయోజనాన్ని కూడా అందిస్తుంది. అదనంగా, వినియోగదారులు ఢిల్లీ, ముంబైలలో MTNL నెట్‌వర్క్‌లో ఉచిత కాలింగ్, రోమింగ్‌ను కూడా పొందవచ్చు.

రూ. 197 ప్లాన్: ఈ రీఛార్జ్ ప్లాన్ ధర రూ. 197. ఈ ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌లో వినియోగదారులు మొత్తం 70 రోజుల చెల్లుబాటును పొందుతారు. ఇది చౌకైన రీఛార్జ్ ప్లాన్. ఇది గరిష్టంగా 70 రోజుల వరకు చెల్లుబాటును అందిస్తోంది. ఈ ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌లో వినియోగదారులు అపరిమిత వాయిస్ కాలింగ్ ప్రయోజనాన్ని పొందుతారు.

ఈ ప్రీపెయిడ్ ప్లాన్‌లో కూడా వినియోగదారులు రోజుకు 2GB డేటా ప్రయోజనాన్ని పొందుతారు. వినియోగదారులు 18 రోజుల పాటు మాత్రమే డేటా ప్రయోజనం పొందుతారు. మొత్తం 36GB డేటాను వినియోగదారులకు అందిస్తోంది. ఈ BSNL ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ వినియోగదారులకు 70 రోజుల పాటు ఉచిత ఇన్‌కమింగ్ కాల్‌లను అందిస్తుంది.

# రిషబ్‌తో కలసి ఎన్టీఆర్ అడుగులు



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నందమూరి తారక రామారావు, కన్నడ స్టార్ నటుడు, దర్శకుడు రిషబ్ షెట్టి ఒకే చోట కలిశారు. ప్రస్తుతం దేవర షూటింగ్ కంప్లీట్ చేసుకున్న తారక్ గాయం కారణంగా రెస్ట్ తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే గాయం నుంచి కోలుకోక ముందే అత్యవసర పనిమీదా మంగుళూరు వెళ్లినట్టు తెలుస్తుంది.తారక్ నేడు మంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో నడుచుకుంటూ వస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. అయితే తారక్‌తో పాటు ఎయిర్‌పోర్ట్‌లో ఇంకో స్టార్ నటుడు కూడా ఉన్నాడు. అతడే రిషబ్ షెట్టి. కాంతారతో నేషనల్ అవార్డు అందుకున్న ఈ నటుడు తారక్‌తో కలిసి ఎయిర్‌పోర్ట్‌లో వస్తున్నట్లు ఈ ఫొటోలు ఉన్నాయి. అయితే వీళ్లు ÷÷-లట్ లో క్యాజువల్ గా కలిశారా లేక ఇద్దరూ కలిసే వెళ్లారా అనేది తెలియాల్సి ఉంది. ఇక వీళ్లిద్దరూ ఒకే ఫ్రేమ్ లో కనిపించడంతో అటు తారక్ ఫ్యాన్స్‌తో పాటు ఇటు రిషబ్ ఫ్యాన్స్ పండగా చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్టీఆర్ తన అమ్మమ్మ ఊరు వెళుతున్నట్లు సమాచారం. తారక్ అమ్మమ్మ వాళ్ల ఊరు మంగుళూరు దగ్గరలోని కుందాపుర. రిషభ్ శెట్టిది కూడా అదే ఊరు. దీంతో ఈ ఇద్దరికి మంచి బాండ్ ఏర్పడింది. ఇదిలావుంటే తాజాగా కాంతారా ప్రీక్వెల్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. రిషబ్ షెట్టికి తారక్‌తో ఉన్న రిలేషన్‌షిప్ వలన కాంతార ప్రీక్వెల్‌లో ఎన్టీఆర్ అతిథి పాత్రల్లో నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# పనిచేసే చోట రక్షణ ఉండాల్సిందే

## 35 చిన్నకథకాదు..పెద్ద సందేశం అంటున్న నివేదా

నివేదా థామస్ , విశ్వదేవ్ ఆర్, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం '35 చిన్న కథ కాదు నందకిశోర్ ఇమాని దర్శకత్వం వహించారు. రానా నిర్మాత. తెలుగు, తమిళ్, మలయాళంలో సెప్టెంబర్ 6న విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా నివేదా మీడియాతో ముచ్చటించారు. '35 చిన్న కథ కాదు' చాలా సింపుల్ స్టోరీ. సరస్వతి పాత్రను పోషించాను. ఇలాంటి పాత్రలు చేయాలని నాకు మొదటి నుంచి ఆసక్తి. తెరపై మీరు నివేదాను చూడరు.. సరస్వతినే చూస్తారని నివేదా అన్నారు. ఇందులో విద్యావ్యవస్థ గురించి గొప్పగా చూపించారు. అలాగే చిన్నచిన్న ఆనందాలను చూపించారు. కరెంట్ పోయినప్పుడు క్యాండిల్ పెట్టుకొని అన్నం తినడం.. ఇలాంటి సన్నివేశాలు ఉన్నాయి. సాధారణంగా ఇలాంటి సీన్స్ మలయాళం చిత్రాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే మలయాళం సినిమాలు వేరే భాషలో డబ్బింగ్ చేయడం కొంచెం కష్టం. ఈ సినిమా తిరుపతి నేపథ్యంలో సాగుతుంది. వెంకటేశ్వరస్వామి కూడా ఓ పాత్రలా చూపించాం. ఒక కుటుంబంలో ఉండే చిన్నచిన్న అపార్థాలు ఎక్కడికి దారితీశాయి అనేది కథ. అమ్మ తన ప్రేమతో ఆ కుటుంబాన్ని ఎలా తీర్చిదిద్దుకుంది అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. కె.విశ్వనాథ్ చిత్రం చూసినట్లు ఉంటుంది. భార్యాభర్తల మధ్య బంధానికి అందరూ కనెక్ట్ అవుతారు. '35' అంటే మార్కులకు సంబంధించినదే ..అందరూ అదే అనుకుంటారు. కానీ, ఇది మార్కులతో పాటు పిల్లలకు సంబంధించినది. వాళ్లకు లెక్కల్లో వచ్చే మార్కుల చుట్టూ కథ తిరుగుతుంటుంది. పిల్లలు అడిగే కొన్ని ప్రశ్నలకు మనకు కూడా సమాధానం తెలియదు. మన దేశంలో 20 ఏళ్లు దాటిన అమ్మాయిని అడిగే మొదటి ప్రశ్న 'పెళ్లి ఎప్పుడు చేసుకుంటావ్?'. అలాంటప్పుడు నేను 20 ఏళ్లు దాటాక తల్లి పాత్ర పోషిస్తే తప్పేముంది. దీని ప్రభావం నా తర్వాత సినిమాలపై పడుతుందని ఆలోచించాను కానీ.. ప్రేక్షకులకు నేను అన్నిరకాల పాత్రలు చేస్తానని తెలియాలి కదా. ఈ పాత్రకు నివేదా మాత్రమే న్యాయం చేయగలదు అని దర్శకులు అనుకుంటే అది ప్రశంసతో సమానం. ఒకేతరహా పాత్రలు చేయాలని నేను అనుకోను. ఇందులో మొత్తం 60 మంది పిల్లలు ఉన్నారు. వాళ్లందరూ హీరోలే. తిరుపతి యాస కోసం శిక్షణ తీసుకున్నా. నెల రోజుల పాటు ప్రతిరోజు ఉదయం ట్యూషన్ చెప్పారు. చిన్నచిన్న పాయింట్లతో సహా అన్నీ నేర్పించారు. ప్రస్తుతం హేమ కమిటీ నివేదిక సంచలనం సృష్టిస్తోంది. నేను 'అమ్మ'లో ఓ సభ్యురాలిని. హేమ కమిటీ నివేదికలో వెలుగుచూసిన అంశాలు చాలా బాధాకరం. వాటి గురించి చాలా ఆలోచించాను. మా కుటుంబంతో కూడా చర్చించాను. అలా ఎందుకు జరిగిందో అర్థం చేసుకోవాలని ఎంతోమందితో చర్చించా. డబ్ల్యూసీసీని ఈ విషయంలో ప్రశంసించాలి. వాళ్ల చొరవ వల్లే ఇది సాధ్యమైంది. మహిళలకు పనిచేసే చోట భద్రత కల్పించడం కనీస అవసరం. దీని గురించి నేనూ రిక్వెస్ట్ చేశాను. ఎందుకంటే మనం ఇంట్లో ఎంత సమయం ఉంటున్నామో దానికంటే ఎక్కువ సమయం పని ప్రదేశాల్లో గడుపుతాం. అలాంటిచోట భద్రత అనేది అత్యవసరం అని నివేదా అన్నారు.



# అశ్వత్థామ పాత్రలో అమితాబ్

## డూప్‌గా ఏడడుగుల సునీల్ కుమార్

'కల్కి 2898 ఎడి' చిత్రంలో ఏడడుగుల అశ్వత్థామపాత్ర ప్రేక్షకుల్ని ఎంతగానో మెప్పించింది. అమితాబ్ బచ్చన్ ఆ పాత్రలో ఎంతగా ఒదిగిపోయారు. ద్వాపర యుగం నాటి పాత్ర కాబట్టి సినిమాలో మిగిలిన అన్ని పాత్రలు ఇప్పటి ఎత్తులో ఉన్నా అమితాబ్ 7 అడుగుల ఎత్తులో కనిపిస్తారు.ఆ పాత్ర ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకర్షించింది. ఇదంతా గ్రాఫిక్ మాయాజాలం అనుకున్నారంతా. కానీ నిజంగానే అంత ఎత్తున్న ఆర్టిస్ట్ ఆ పాత్రను పోషించారు. అంటే అమితాబ్ బచ్చన్‌కు డూప్‌గా చేశారు. ఇందులో అమితాబచ్చన్‌కి డూప్‌గా జమ్మూ కశ్మీర్‌కు చెందిన సునీల్ కుమారం ఎత్తు ఏడు అడుగులు ఏడు అంగుళాలు. జమ్మూలోని పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. సినిమాలపై ఉన్న ఆసక్తితో ప్రయత్నాలు చేశారు. కల్కి సినిమాతోపాటు పలు హిందీ సినిమాల్లో అవకాశం అందుకున్నారు. ప్రస్తుతం వరుసగా చిత్రాల్లో నటిస్తున్న సునీల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'కల్కి' చిత్రీకరణ అనుభవాలను పంచుకున్నాడు. 'చిన్నప్పటి నుంచి నేను అమితాబ్ సర్ ఫ్యాన్. నేను మాత్రమే కాకుండా నా కుటుంబ సభ్యులు మొత్తం అమితాబ్ జీ ఫాన్సే. అలాంటి అమిత్ జీ కి డూప్‌గా నటించాలి అన్నప్పుడు సర్‌ప్రైజ్ అయ్యాను. కల్కి సినిమా సెట్స్‌లో మొదటి రోజు అడుగు పెట్టిన విషయం ఎప్పటికి మరచి పోలేను. ప్రభాస్, అమితాబ్ గారు కలిసి కూర్చుని ఉన్నారు. నన్ను చూడగానే నా వద్దకు వచ్చి మాట్లాడారు. ఆ రోజును నేను ఎప్పటికీ మరచిపోలేను. కల్కి సినిమా కోసం పలు యాక్షన్ సన్నివేశాల్లో నేను నటించాను. చాలా రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొనే అవకాశం దక్కిందని చెప్పారు. షూటింగ్ కోసం సెలవు పెట్టి ముంబై, హైదరాబాద్ తిరగాలంటే సెలవులు కొంచెం కష్టమైనా సినిమాల్లో నటించడం బాగానే ఉంది అని సంతోషపడుతున్నారు సునీల్‌కుమార్.

# 2న గబ్బర్ సింగ్ రీరిలీజ్

## ఆనాటి విశేషలు పంచుకున్న హరీష్ శంకర్, బండ్ల

పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన సూపర్‌హిట్ మూవీ 'గబ్బర్ సింగ్' 2012లో విడుదలై పవన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచి కలెక్షన్ల వర్షం కురిపించింది. తాజాగా ఈ చిత్రం మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న 'గబ్బర్ సింగ్' రీ–రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో దర్శకుడు హరీశ్ శంకర్, చిత్ర నిర్మాత బండ్ల గణేశ్ మీడియాతో ముచ్చటించారు. 'సోషల్‌మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈరోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అని నా మనసులో ఎప్పటినుంచో ఒక చిన్న వెలితి ఉండేది. ఆ వెలితి ఇప్పుడు తీరింది. నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిన ఈ టీమ్‌కు ధన్యవాదాలు. 'గబ్బర్ సింగ్' అంటేనే ఒక చరిత్ర. అందులో ఎలాంటి సందేహం లేదు. మా జీవితాలను మార్చేసిన చిత్రమిది. ఈ సినిమా మేము ఊహించిన దానికంటే భారీ విజయాన్ని అందుకుంది. ఎక్కడికి వెళ్లినా అభిమానాన్ని చూపించారు. ఈ సక్సెస్ అందరికంటే బలంగా కోరుకున్న వ్యక్తి బండ్ల గణేశ్. ఈ సినిమా సక్సెస్ ఊహించిన తొలి వ్యక్తి పవన్‌కల్యాణ్. డబ్బింగ్ సమయంలోనే ఆయన ఇది పక్కా బ్లాక్‌బస్టర్ అన్నారు. ఇది ఎవర్‌గ్రీన్ మూవీ' అని హరీశ్ శంకర్ తెలిపారు. 'నా తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే. పవన్‌కల్యాణ్ నాకు బతుకునిచ్చారు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. నేను ఆర్థికంగా ఏ స్థాయికి వెళ్లినా పవన్ లేకపోతే ఈ పేరు, క్రేజ్ ఉండేది కాదు. 'చింతకాయల రవి' నుంచి నాకు హరీశ్‌తో సత్సంబంధాలు ఉండేవి. ఒకరోజు పవన్ నన్ను పిలిచి.. 'నేను సినిమా చేస్తా. నువ్వు నిర్మాతగా ఉంటావా అని అడిగారు'. నన్ను నిర్మాతగా చేసిన ఆయనకు పాదాభివందనం. 'గబ్బర్‌సింగ్' ఒక చరిత్ర. పవన్‌కల్యాణ్ అభిమానులకు ఈ సినిమా ఎంతో ప్రత్యేకమైనది. ఆయనతో 'తీన్‌మార్' చేశా. పవన్ గొప్ప మానవత్వం, నిజాయతీ, నిబద్ధత కలిగిన వ్యక్తి. నీతి పరుడు. దేశంలోనే అత్యధిక పారితోషికం అందుకుని, సంతోషంగా జీవితాన్ని కొనసాగించే నటుడు పవన్‌కల్యాణ్. జనం కోసం తన కుటుంబాన్ని వదిలేసి పోరాడుతున్నారు. దాదాపు 10ఏళు ప్రజల కోసం పోరాడి ఈ రోజు ఒక స్థాయికి వచ్చారు. పవన్‌తో గబ్బర్‌సింగ్ చేయడం నా అదృష్టం. రీ రిలీజ్‌కు ఏడాది నుంచే ప్లాన్ చేస్తున్నా. గుజరాత్‌లో షూట్ చేస్తున్నప్పుడు పవన్ గుర్రంపై నుంచి కిందపడ్డారు. ఆరోజు నాకు గుండె ఆగిపోయింది. షూట్‌లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. దర్శకుడు ఏం చెబితే ఆయన చేశారు. రీ రిలీజ్ టికెట్లు కోసం చాలామంది ఫోన్లు చేస్తున్నారు. తెలుగు సినీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తున్న రోజులివి. దాదాపు ఏడేళ్ల నుంచి సినిమాలు నిర్మించకుండా ఉన్నందుకు బాధపడుతున్నా. ఇకపై బ్లాక్‌బస్టర్ సినిమాలు చేస్తా. సినిమాల్లో పుట్టా. సినిమాల్లోనే ఉంటా. సినిమానే నా వ్యాపకం, ఆశ, జీవితం. పరమేశ్వర ఆర్ట్స్ బండ్లగణేశ్ అంటే ఏంటో చూపించేందుకు బ్లాక్‌బస్టర్ చిత్రాలు నిర్మిస్తా. అదే సంకల్పంగా ముందుకు సాగుతా' అని బండ్ల గణేశ్ అన్నారు. సినిమా సక్సెస్‌ను ఊహించిన వ్యక్తి పవన్‌కల్యాన్‌గారు. మరో పుష్కర కాలం తర్వాత వచ్చినా ఈ సినిమా ట్రెండ్ ఇలాగే ఉంటుంది' అని అన్నారు.

# హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నా.. మోహన్ లాల్

జస్టిస్ హేమ కమిటీ నివేదిక మలయాళ చిత్రపరిశ్రమను కుదిపేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో కేవలం 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్' ను లక్ష్యంగా చేసుకోవద్దని 'అమ్మ' మాజీ అధ్యక్షుడు మోహన్ లాల్ విజ్ఞప్తి చేశారు. హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నామని. ఆ నివేదికను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం సరైనదేనన్నారు. అన్ని ప్రశ్నలకు 'అమ్మ' సమాధానం ఇవ్వడం సాధ్యం కాదన్నారు. మలయాళ చిత్రపరిశ్రమ.. చాలా కష్టపడి పనిచేసే పరిశ్రమ అని, ఇందులో చాలామంది ఉన్నారని, అందరినీ నిందించలేమని తెలిపారు. ఈ వ్యవహారంలో దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో దయచేసి పరిశ్రమను నాశనం చేయకండని విజ్ఞప్తి చేశారు. దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఇటీవలే 'అమ్మ' అధ్యక్ష పదవికి మోహన్ లాల్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.





Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com